
# శ్రీ రమణ ప్రస్థాన త్రయము



- డా॥ కె. రామారావు

# శ్రీ రమణ ప్రస్థాన త్రయము

అక్షరమణమాల

శ్రీ రమణ సూత్రాలు

నేనెవడను?

శ్రీ రమణోపనిషత్తు

డా॥ కె. రామారావు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

శ్రీ రమణ ప్రస్థాన త్రయము

ముద్రణ : డిసెంబరు, 2016

ఈశ్వరుడు జీవులను వారి వారి
ప్రారబ్ధములను అనుసరించి
ఆడిస్తున్నాడు. జరుగవలసినది
జరిగే తీరును, జరుగరానిది ఎవరు
ఎంత ప్రయత్నము చేసినా జరుగనే
జరుగదు - ఇది నిశ్చయము.

వెల : రు॥ 20/-

# ముందుమాట

అజ్ఞానము నుంచి జీవులను విడుదలచేయుటకు తన సహాయ సహకారములను అందించుటకు సాక్షాత్తు ఆ పరబ్రహ్మమే అరుణగిరిగా ఆకృతి ధరించినది.

మానవశరీరానికి గుండె ఎటువంటిదో - ఈ భూమండలానికి అరుణాచలము అటువంటిది. పంచ భూతముల కలయికే ప్రకృతి. పంచభూతములకు పంచ లింగములను ప్రతిష్ఠించారు మనపూర్వులు. అందు అరుణాచలము అగ్నిలింగము - అదే ఆది లింగము. అన్నిఋణములనుంచి విముక్తిచేసేదే (అ+రుణ+చలము) అరుణాచలము! నిప్పును తెలిసి ముట్టుకున్నా - తెలియకముట్టుకున్నా అది కాల్చి తీరుతుంది. అదేవిధముగా "అరుణాచలా" - అని ఒక్కసారి స్మరిస్తేచాలును - అది మనఅహంకారాన్ని దహించివేస్తుంది.

ఒకసారి బ్రహ్మదేవుడికి, విష్ణుదేవుడికి "నేను గొప్పంటే నేనుగొప్ప" అని వివాదమువచ్చి, తీర్పు కోసం పరమేశ్వరుని చెంతకువెళ్ళారు. అంత పరమేశ్వరుడు జ్యోతిస్థంభరూపము ధరించి "నా ఆదిగాని, అంతము

గాని ఎవరైతే ముందుచూసి వస్తారో - వారుగొప్ప" అని చెప్పాడు.

అప్పడు విష్ణుదేవుడు వరాహరూపముధరించి జ్యోతిస్వరూపుడైన పరమేశ్వరుని మొదలుచూచుట కోసం భూమిని దొలుచుకొని వెళ్ళాడు. బ్రహ్మాదేవుడు హంసరూపముధరించి పరమేశ్వరుని చివరచూచుట కోసం పైకి వెళ్ళాడు.

ఎంతలోతునకు వెళ్ళినా జ్యోతిస్థంభము యొక్క మొదలు కనిపించక విష్ణుదేవుడు వెనుతిరిగి వచ్చి - తనఓటమిని అంగీకరించాడు. బ్రహ్మాదేవుడు పైకి వెళ్ళాడు, వెళ్ళాడు - కాని ఆజ్యోతిస్థంభముయొక్క చివర కనిపించలేదు. అంతలో పైనుంచివస్తున్న ఒక మొగలిరేకు కన్పించినది. ఆమొగలిరేకును "నీవు ఎక్కడి నుంచి వస్తున్నావు" అని ప్రశ్నించాడు బ్రహ్మాదేవుడు.

"శివుని శిరస్సు నుండి నేను జారిపడి ఇప్పటికి ఎన్నోయుగాలైనది - అప్పటినుంచి నేను పయనిస్తూనే ఉన్నాను" అంది మొగలిరేకు.

"శివుని శిరస్సునుండి జారిపడే ఎన్నోయుగాలైన దని మొగలిరేకు చెప్పచున్నదే! ఒకవేళ ఈపాటికి విష్ణుదేవుడు జ్యోతిస్థంభముయొక్క మొదలు చూసి

వచ్చివుంటాడేమో?" అని బ్రహ్మదేవుడు భీతిచెంది - "నీవు నాకొకసహాయము చేయాలి. నేను శివుని శిరోభాగం చూడడానికి బయలుదేరి ఇప్పటికే చాలాకాలమైంది. నీవు శివుని శిరస్సునుండి వస్తున్నావు కాబట్టి, నేను శివుని శిరస్సును చూసినట్లు శివుని దగ్గర సాక్ష్యంచెప్ప సరిపోతుంది" అని బ్రహ్మ దేవుడు అడిగాడు.

బ్రహ్మదేవుడంతటివాడు అడుగుతుంటే కాదనుట దేనికని "సరే చెప్తాను" అంది మొగలిరేకు.

ఇంతలో కామధేనువు కనిపించినది. మరో సాక్ష్యముంటే ఎందుకైనా మంచిదనుకున్నాడు బ్రహ్మ దేవుడు. "నీవెక్కడినుండి వస్తున్నావు?" అని కామధేనువుని ప్రశ్నించాడు.

"శివుని శిరోభాగమునుండి వస్తున్నా"నంది కామధేనువు.

"అయితే నాకొకసహాయం చేయాలి - నేను శివుని శిరస్సు చూసినట్లు శివునిచెంత సాక్ష్యంచెప్పాలి" అని అడిగాడు బ్రహ్మదేవుడు.

బ్రహ్మదేవుడంతటివాడు తనసహాయం అర్థిస్తుంటే కాదనలేక "సరే"నంది కామధేనువు.

రెండుసాక్ష్యాలనూ వెంటపెట్టుకొని

పరమేశ్వరుని దగ్గరకు తిరిగివచ్చాడు బ్రహ్మదేవుడు - "నేను నీ చివరిభాగం చూసివచ్చాను - ఇదిగో సాక్ష్యం!" అని మొగలిరేకును, కామధేనువును చూపించాడు.

ఒకజీవుడు మరొకజీవుణ్ణి మోసంచేయవచ్చు. కాని సర్వాంతర్యామియైన పరమేశ్వరుణ్ణి మోసం చేయలేము.

"నిజమేనా" అని సాక్షులను ప్రశ్నించాడు పరమేశ్వరుడు.

"ఔను - నిజమే" అంది మొగలిరేకు.

కాని, కామధేనువు అబద్ధము చెప్పడానికి భయపడి - "నిజమే"నని నోటితో చెబుతూ - "నేను నోటితో చెప్పేది నిజముకాదు" అని తనతోకను అడ్డముగా ఆడించినది.

వెంటనే పరమేశ్వరుడు - "నీవు అబద్ధము చెప్పావు కాబట్టి భూలోకములో జనులెవ్వరూ నీకు గుడులు కట్టి పూజించకుందురుగాక" అని బ్రహ్మదేవుణ్ణి శపించాడు.

"నీవు అబద్ధము చెప్పావు కాబట్టి, ఈరోజు నుంచి నా పూజాద్రవ్యాలలో నీకు చోటులేదు" అని మొగలిరేకును శపించాడు.

"నీవు నోటితో అబద్ధము చెపుతూ - తోకతో నిజము చెప్పావు కాబట్టి - జనులు నీ తోకనే పూజిస్తారు గాని, నీ మొఖాన్ని పూజించకుందురుగాక" అని కామధేనువును శపించాడు.

అంత బ్రహ్మవిష్ణువులు ఆజ్యోతిస్వరూపమును ఉపసంహారించమని ప్రార్థించగా - అప్పుడు పరమేశ్వరుడు "అరుణగిరి" రూపము ధరించాడు. గిరిరూపము అర్చనకు కష్టమని దేవతలంతా ప్రార్థించగా పరమేశ్వరుడు లింగరూపము ధరించాడు. అదే అరుణాచల లింగము - ఆది లింగము! అరుణాచల క్షేత్రములో పరమేశ్వరుడు మూడు రూపములలో వెలిసియున్నాడు - 1. గిరిరూపము, 2. లింగరూపము, 3. సిద్ధరూపము.

అరుణగిరిపైన ఉత్తరదిక్కున ఒక మర్రిచెట్టుక్రింద పరమేశ్వరుడు రక్త మాంసములతో కూడిన దేహధారియై ఈనాటికికూడా సిద్ధరూపమున ఉన్నాడని మనపురాణములలో వ్రాయబడి యున్నది. "ఔను - నిజమే! ఆ మర్రిచెట్టు ఆకును నేను చూశాను" అన్నారు భగవాన్ శ్రీరమణ మహర్షి.

బ్రహ్మా విష్ణువులకే పరమేశ్వరుని ఆదిగాని

అంతముగాని అందలేదంటే అర్థమేమిటి? ఆత్మకు ఆదీ లేదు - అంతమూలేదు! అది అనంతము! ఆ అనంత మైన ఆత్మ మాటకు, మనస్సుకు మరి అందుతుందా?

అరుణాచలము అహంకారమును హరించుట కు వచ్చిన క్షేత్రము. "అరుణాచలం" పంచాక్షరీతో సమానము. "అరుణాచలా" అని స్మరించినంత మాత్రముచేతనే - ఈజీవులు అహంకారరహితులై ఆత్మను "తాను"గా అనుభవము పొందుతారు.

అట్టి అరుణాచలేశ్వరుణ్ణి వరునిగా - తాను వధువుగా భావించి, అరుణాచలేశ్వరుణ్ణి స్తుతిస్తూ శ్రీ రమణాచార్యుడు "అక్షరమణమాల" రచన చేశాడు. అక్షరమణమాల అంటే అక్షరములతో కూర్చిన పెండ్లి నాటి మాల. పువ్వులతో కూర్చిన మాలైతే వాడిపోయి రాలిపోతుందని కాబోలు అక్షరములతో కూర్చిన పెండ్లి మాలను తయారుచేశాడు శ్రీరమణస్వామి!

ఈ సృష్టిని దాటిన రమణస్వామికి పెళ్ళికావాలా - సంసారంకావాలా? - కాదు! ఇది మనకోసం వ్రాసాడు. మనకు తెలిసిన మాటలతో మనకు తెలియని జ్ఞానాన్నిగురించి చెప్పటకోసం ఈ అక్షరమణ మాల రచన చేశాడు. "దేవుడు కల్పితం. జీవుడు కల్పితం.

లోకం కల్పితం" అని చెప్పిన శ్రీరమణస్వామికి ఈ కవిత్వాలతోగాని, రచనలతోగాని పనిలేదు. మనల్ని కూడా తనంతటి వాళ్ళుగా తయారుచేయుటకు మన పట్ల తనకున్న ప్రేమను, దయను దాచుకోలేక ఈ కవిత్వం చెప్పాడుగాని - ద్వైతం దాటినవాడికి వీటితో పనిలేదు.

శ్రీరమణస్వామి విరూపాక్షగుహలోనుండగా కొందరుభక్తులు భిక్షకోసం ఏవైనాపాటలు వ్రాసి ఇవ్వమని ప్రార్థించారు. అంత ఒకనాడు భక్తులతో కలసి అరుణగిరి ప్రదక్షిణ చేస్తుండగా - "అరుణాచల మనుచు స్మరియించువారల అహమునిర్మూలింతు వరుణాచలా!" అని తనహృదయములోనుంచి పొంగి వస్తున్న ద్విపదతో అక్షరమణమాలకు శ్రీకారంచుట్టారు శ్రీరమణస్వామి.

ఈ అక్షరమణమాల నవరసభరితం! రస హృదయులకు దానివిలువ వెలలేనిది. అనుదినము అక్షరమణమాలను భక్తిశ్రద్ధలతో పఠిస్తే - పరమేశ్వరుని పట్ల మనకు ప్రీతి కలుగుతుంది. శరణాగతి కుదురు తుంది. పరమేశ్వరుని కృప మనపైన ప్రసరిస్తుంది. మనకు దారి కనిపిస్తుంది.

కైలాసగిరి పరమేశ్వరుని నివాసము మాత్రమే

- కాని అరుణగిరి సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడే! అరుణాచలస్మరణ చాలు ఈ జీవులు తరించటానికి! అరుణగిరిప్రదక్షిణ పుణ్యప్రదం! "సాక్షాత్తూ అరుణాచలేశ్వరుడే తనచుట్టూతాను సంవత్సరానికి రెండుసార్లు ప్రదక్షిణ చేస్తాడు" కనుక ఆ ప్రదక్షిణ మహిమను మీరే ఊహించుకోండి!

ఈ అరుణాచలక్షేత్రమునే "తిరువణ్ణామలై" అని అంటారు. ఇది తమిళనాడు రాష్ట్రములో చెన్నైకు 120 మైళ్ళ దూరమున ఉంది. చెన్నై నుంచిగాని, తిరుపతి నుంచిగాని తిరువణ్ణామలై వెళ్ళవచ్చును.

అరుణాచలరమణుడిని దర్శించండి - అరుణాచలమును స్మరించండి - అరుణగిరి ప్రదక్షిణ చేయండి - మీరు తరించండి!

# ప్రార్థన

ద్విపద : సాక్షాదరుణ గిరీశ్వర వరార్హమగు॥

అక్షరణమాల నమరించుటకును॥

కరుణాకరుండగు గణపతి యొసగి॥

కరమభయకరము కాపాడుగాక॥

తా॥ కరుణామయుడవైన ఓ గణపతీ! సాక్షాత్తూ అరుణాచలేశ్వరుడను పెండ్లికుమారునికి అలంకరించుటకు తగినటువంటి పెండ్లిమాలను అక్షరములతో కూర్చుటకు నాకు నీ అభయహస్తాన్ని ప్రసాదించి కాపాడు స్వామీ!

**అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాల శివ - అరుణాచలా!**

**అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచలా!**

# అక్షరమణమాల

1. అరుణాచలమనుచు స్మరియించు వారల
అహము నిర్మూలింతు వరుణాచలా!

తా. "అరుణాచలా" అని నిన్ను స్మరించువారి అహంకారమును హరించివేస్తావు అరుణాచలా!

2. అళగు (అందం) సుందరముల వలె చేరి
నేను నీవుంద మభిన్నమై యరుణాచలా!

తా. అందం - అందం కలిసిపోయినట్లు (నాతల్లి అళగమ్మ నాతండ్రి సుందరమయ్యర్ కలిసిమెలిసి అన్యోన్యంగా జీవించినట్లు) మన మిరువురము "నీవు-నేను" అను బేధము లేకుండా కలిసిపోయి ఒకటిగాఉందాము అరుణాచలా!

3. లోదూరి లాగి నీ లోగుహను చెరగా
నమరించి తేమొకో అరుణాచలా?

తా. నీవు నాలో ప్రవేశించి, నన్ను అహంకారమనే గూటిలోనుంచి బయటికిలాగి - నీ హృదయ గుహలోనికి నన్ను గుంజుకొని, నీ ఆత్మ స్వరూప ములో నేను స్థిరముగా ఉండునట్లు చేశావు.

ఇలా ఎందుకు చేశావు అరుణాచలా?

**4. ఎవరికిగా నన్ను ఏలితి, విడిచిన**
**అఖిలము నిందించు నరుణాచలా!**

తా. నన్ను అద్వైతశిఖరం మీద అధిష్ఠింపచేశావే - ఎందుకు చేశావు? ఎవరి కోసం చేశావు? ఇంత చేసిన నీవు - ఇప్పుడు నన్ను మధ్యలో విడిచి పెడితే ఈలోకము నిన్ను నిందిస్తుంది అరుణాచలా!

**5. ఈ నింద తప్పు, నిన్నేటికి తలపించి**
**తిక విడువారెవ రరుణాచలా?**

తా. ఏమీ తెలియని నా చేత నిన్ను స్మరింపచేశావే - ఇలా ఎందుకు చేశావు? ఇది నీ తప్పు కాదా? ఈ నిందను నీకు రానీయకు అరుణాచలా! ఒక్కసారి నీసుఖస్వరూపాన్ని రుచిచూశాక - నీవు కాదన్నా నిన్ను ఎవరు విడిచిపెట్టగలరు అరుణాచలా?

**6. కనిన జననికన్న ఘనదయాదాయకా**
**ఇదియా యనుగ్రహ మరుణాచలా?**

తా. లోకములో కన్న తల్లిప్రేమ ఎంతోమిన్న! ఆ కన్నతల్లిని మించిన కరుణామయుడవు నీవు! తల్లి

దేహాన్నిమాత్రమే శుద్ధిచేస్తుంది - కాని నీవు దేహాన్ని, ఇంద్రియాలను, మనస్సును కూడా శుద్ధి చేసి - నీ ఆత్మ సామ్రాజ్యానికి నన్ను చక్రవర్తిని చేశావే! నీ అనుగ్రహాన్ని ఏమనిచెప్పను అరుణాచలా?

**7. నిన్నే మార్చి యరుగనీక యుల్లము పైని**
**ఉఱుదిగా నుండుమా యరుణాచలా!**

తా. నా మనస్సు నన్ను ఎలాగు మాయచేసి ప్రకృతి లోనికి పరుగెడుతున్నది - అది నిన్ను కూడా మాయ చేస్తుందేమో! అందుచేత నా మనస్సు కదలకుండా, మెదలకుండా అణిగిఉండేలా నా మనస్సులో నీవు స్థిరముగా నిలిచివుండు అరుణాచలా!

**8. ఊరూరు తిరుగక ఉల్లము నినుగని**
**యణగ నీద్యుతి జూపు మరుణాచలా!**

తా. లోకవిషయాలను మరిగి జన్మల తరబడి ఊరూరు తిరుగుతున్న నా మనస్సు - నిన్ను చూసేవరకూ అణగదు! కనుక నీ సుందర చైతన్య సుఖ స్వరూపాన్ని ఒక్కసారి నాకు చూపించు అరుణాచలా!

9. నను చెఱపి యిపుడు ననుకలువక విడు
టిది మగతన మొక్కో యరుణాచలా?

తా. నా మనస్సంతా నీవే ఆక్రమించుకొని - నన్ను ఈ లోకానికి పనికిరాని వ్యర్థుణ్ణి చేశావు. ఇప్పుడు నీస్వరూపంలో నన్ను కలుపుకోకుండా మధ్యలో విడిచిపెడితే - అది మగతనమా అరుణాచలా?

10. ఏటికీ నిదుర నన్ని తరులు లాగగ
యిది నీకు న్యాయమా అరుణాచలా?

తా. ఇంద్రియాలు అనే తుంటరులు నన్ను బయటికి లాగి పతనము చేస్తుంటే - నన్ను రక్షించగలశక్తి నీకుండి కూడా నీవు అలా నిదురపోతున్నావే - ఇది నీకు న్యాయమా అరుణాచలా?

11. పంచేంద్రియ ఖలులు మదిలోన దూరుచో
మదిని నీవుండవో అరుణాచలా?

తా. పంచేంద్రియాలు అనే ముష్కరులు నామనస్సులో ప్రవేశిస్తే - అక్కడ నీవుండవా అరుణాచలా? మరి అక్కడ ఉండక నీవెక్కడికి పోతావు? పోవటానికి నీవులేని చోటెక్కడుంది?

12. ఒకడవౌ నిను మాయ మొనరించి వచ్చువా
రెవరిది నీ జాల మరుణాచలా!

తా. ఉన్నది నీవు ఒక్కడివే కదా! నిన్ను మోసం చేసి రాగల శక్తి ఎవరికుంది అరుణాచలా? ఇదంతా నీ మాయాజాలము కాదా?

13. ఓంకార వాక్యార్థ ఉత్తమ సమహీన
నిన్నెవరెరుగువా రరుణాచలా?

తా. ఓంకారానికే అర్థము నీవు కదా? అట్టి నీతో సమానమైనవారు ఎవరున్నారు? నీతో సమాన మైన వారే లేనప్పడు - ఇక నిన్ను మించిన వారు ఎవరుంటారు? అటువంటి నిన్ను తెలుసుకొనుట ఎవరికి సాధ్యము అరుణాచలా?

14. అవ్వ బోలె యొసగి నాకు నీ కరుణ న
న్నేలుట నీభార మరుణాచలా!

తా. అవయ్యార్‌ను నీఅనుగ్రహముతో ఎలా కరుణించావో - అదేవిధముగా నామీద కూడా నీ కరుణామృతాన్ని కురిపించి కాపాడవలసిన భారము నీదే అరుణాచలా!

15. కన్నుకు కన్నయి కన్ను లేక కను నిన్
కనువారెవరు కను మరుణాచలా!

తా. స్వశక్తితో చూసే శక్తిలేని మా కళ్లకు ఆ చూసే శక్తిని యిస్తున్న నీవు - కళ్ళు లేకుండానే చూడ గలవు. అట్టి చైతన్యస్వరూపుడవైన నిన్ను చూడ గలవారు ఎవరైనా ఉన్నారేమో చూడుము అరుణాచలా! (ఎవ్వరూ లేరు)

**16. కాంత మినుమును వలె గలిసి నన్ విడువక**
**కలిసి నాతో నుండు మరుణాచలా!**

తా. అయస్కాంతము యినుమును గట్టిగా ఎలా పట్టుకొంటుందో - అదేవిధముగా నీవు కూడా నన్ను విడిచిపెట్టక నాతో కలిసివుండుము అరుణాచలా!

**17. గిరి రూపమైనట్టి కరుణా సముద్రమా**
**కృపజేసి నన్నేలు మరుణాచలా!**

తా. నీవు పైకి కొండరూపమున కనిపిస్తున్న గొప్ప కరుణాసముద్రుడవు. నీ కరుణను నాపైన కురిపించి నన్ను కాపాడుము అరుణాచలా!

**18. క్రింద మీదెటను చెన్నొందు కిరణమణి**
**నాక్రిందుగతి మాపు మరుణాచలా!**

తా. అంతటా వ్యాపించిన హద్దులులేని అనంతకాంతి స్వరూపుడవైన నీవు - నా అజ్ఞానాంధకారాన్ని

పోగొట్టు అరుణాచలా!

19. కుట్రమంతయు గోసి గుణముగ పాలించు

గురురూపమై వెలు గరుణాచలా!

తా. మనస్సులోని మాలిన్యమునంతా కడిగి, సద్గుణ ములతో అలంకరించు సద్గురు రూపమున నీవే వచ్చి - నాకు దారిచూపించు అరుణాచలా!

20. చూచి వాల్గన్నుల కోతబడక కృప

చేసి నన్చేరి కా వరుణాచలా!

తా. అందమైన వాలుకన్నుల చూపులలో -చిక్కుకొన కుండా - కృపతో నాచెంతచేరి నన్ను నీలో కలుపు కొని కాపాడు అరుణాచలా!

21. వంచకా వేడియున్ కొంచమున్ కరుగవే

అభయమంచేలుమా అరుణాచలా!

తా. ఎంత ప్రార్థించినా కొంచెముకూడా కరుగవేమిటి అరుణాచలా - నీవు మరీ యింతటి వంచకుడివా? నాకు కాస్త అభయమిచ్చి యేలుకో అరుణాచలా!

22. అడుగ కిచ్చెడు నీదు అకళంకమగు కీర్తి

హాని సేయక బ్రోవు మరుణాచలా!

తా. అడగకుండానే అన్నీ యిచ్చే స్వామివని నీకు స్వచ్ఛమైన కీర్తివుందే! అట్టి నీకీర్తికి మచ్చ రానీయక నన్ను రక్షించు అరుణాచలా!

**23. హస్తామలక నీదు సద్రసమున సుఖో**
**న్మాద మొందగ యేలు మరుణాచలా!**

తా. ఓ హస్తమలకా! నీ సుఖ స్వరూపములో నన్ను ముంచెత్తి - ఆ మత్తులో నన్ను ఉన్మాదుడ్ని చేసి - నీవు యేలుకో అరుణాచలా!

**24. వలనుంచి భక్తుల పరిమార్చు నిను గట్టు**
**కొని యెటు జీవింతు నరుణాచలా?**

తా. ప్రకృతి వలలోపడి కొట్టుకొంటున్న నీ భక్తుల అహంకారాన్ని హతమార్చుటయే పనిగా పెట్టుకొన్న నీవు - నిన్నుకట్టుకొన్న నన్ను మాత్రము అహంకార ముతో ఎలా జీవించనిస్తావు అరుణాచలా?

**25. కోపరహితగుణ గురిగాగ ననుగొను**
**కొఱయేమి చేసితి నరుణాచలా?**

తా. నాకుతెలిసి నీకునేను ఏ లోటూచేయలేదే? ఒకవేళ నాకుతెలియక నేను ఏదైనా లోటు చేసినప్పటికీ - నీకు అసలు కోపమనే గుణమే

లేనివాడివి కదా? కనుక నాలో ఏదైనా లోపమున్నప్పటికీ కోపగించుకోక నన్నే లక్ష్యంగా పెట్టుకొని కాపాడు అరుణాచలా!

**26. గౌతమ పూజిత కరుణా ఘన నగమా**
**కడగంట యేలుమా అరుణాచలా!**

తా. గౌతమాదిఋషుల పూజలందుకున్న గొప్ప కరుణా మయుడవైన ఓ అరుణాచలా - నా అజ్ఞానము పూర్తిగా అంతమయ్యేవరకూ నన్ను విడిచిపెట్టక రక్షించు అరుణాచలా!

**27. సకలము కబళించు కరకాంతియైన మనో**
**జలజ మలర్పుమా అరుణాచలా!**

తా. తనకాంతికిరణములతో చీకటిని తొలగించి, కమలములను వికసింపజేయు సూర్యునివలె - నీ జ్ఞానజ్యోతిని నాలో వెలిగించి, నా అజ్ఞాన తిమిరాన్ని హరియించి, నా హృదయకమలాన్ని వికసింపజేయి అరుణాచలా!

**28. తిండిని నిన్జేరితిని తిన నా నేను**
**శాంతమై పోవుదు నరుణాచలా!**

తా. నీకు ఆహారముగా నా 'నేను'ను (అహంకారాన్ని) అర్పించుటకు నీచెంతకు చేరాను. నా ఈ

"నేను" ను (అహంకారాన్ని) నీవు ఆహారముగా స్వీకరిస్తే - నేను శాంతిని పొందుతాను అరుణాచలా!

**29. మది చల్లబడ భద్రకరముంచి యమృతనోర్**
**తెరు మనునగ్రహచంద్ర యరుణాచలా!**

తా. అనుగ్రహ స్వరూపుడవైన ఓ అరుణాచలా! నా మనస్సు చల్లబడేటట్లు అభయమిచ్చి నీ అమృత స్వరూపాన్ని నాకు అనుగ్రహించు అరుణాచలా!

**30. వన్నెను చెఱపి నిర్వాణ మొనర్చి కృ**
**పావన్నె నిడి బ్రోవు మరుణాచలా!**

తా. నాజీవలక్షణాలను హరించి, దేహపరిమిత బుద్ధి నుంచి విడుదలచేసి - నీ కృపతో నన్ను అలంకరించి యేలుకో అరుణాచలా!

**31. సుఖ సముద్రముపొంగ వాఙ్మనములడంగ**
**యూరక నమరుమం దరుణాచలా!**

తా. హృదయములోనున్న సుఖసముద్రము ఉప్పొంగి, నా మాట మనస్సు అణిగిపోయేటట్లు - నీవు నా హృదయములో స్థిరముగా నిలిచిపో అరుణాచలా!

**32. వంచింతు వేల నన్ శోధింప కిక నీదు**

**జ్యోతి రూపము జూపు మరుణాచలా!**

తా. నన్ను మోసగింపక, ఇకనైనా నీ పరీక్షలుమాని - నీ జ్యోతిస్వరూపాన్ని నాకు చూపించు అరుణాచలా!

**33. పదవిద్య గరపి ఈ భూమి మైకము వీడి**
**రూపగు విద్య జూపరుణాచలా!**

తా. బ్రహ్మవిద్యను నాకు బోధించి, ఈ భూమి మైకము నుంచి నన్ను బయటికిలాగి - విద్యలలోకెల్ల శ్రేష్ఠమైన నీ ఆత్మవిద్యను నాకు చూపించు అరుణాచలా!

**34. చేరకున్నను మేను నీరుగ కరిగి క**
**న్నీటేరయి నశింతు నరుణాచలా!**

తా. నన్ను నీలో కలుపుకోకపోతే - నా తనువు నీరుగా కరిగి, కన్నీటి ఏరుగామారి నేను నశించి పోతాను అరుణాచలా!

**35. ఛీయని ద్రోసిన చేయుకర్మ తపన**
**గాకేది మనుమార్గ మరుణాచలా?**

తా. నీవు "ఛీ" అని నన్ను త్రోసివేస్తే - నీకోసం పరితపించి విలపిస్తూ జీవించుటకంటే నాకు మరోమార్గమేముంది అరుణాచలా?

**36. చెప్పక చెప్పి నీవు మౌనత నుండని**

**యూరక నుందువే అరుణాచలా?**

తా. నన్ను మౌనంగావుండమని నీవు నోటితో చెప్ప కుండానే చెప్పి - నీవుకూడా అలా మౌనంగానే (కొండరూపమున) ఉండిపోయావేమిటి అరుణాచలా?

**37. సోమరియైతిని మిన్నని సుఖనిద్ర**
**కన్న వేఱేది గతి యరుణాచలా!**

తా. ఎరుకలో నిద్రసుఖాన్ని మరిగి సోమరినైన నేను ఈ లోకములో పొందతగిన పరమస్థితి ఇంకేముంది అరుణాచలా!

**38. శౌర్యము జూపితి శమియించె నని మాయ**
**చలియింపకున్నావు అరుణాచలా!**

తా. నీ శౌర్యము చూపించి - నా మాయను తొలగిం చావు. మరి అంతటితో నీ పని పూర్తైనదను కుంటున్నావా - అలా చలనములేని అచల రూపమున నిలిచిపోయావు అరుణాచలా?

**39. కుక్కకు న్నీచమే నేనే గురుతు గొని**
**వెదకి నిన్జేరుదు నరుణాచలా?**

తా. నేను కుక్కకంటే హీనుడననుకుంటున్నావా

అరుణాచలా? అడుగుజాడల వాసననుబట్టి కుక్క తనయజమానిని చేరుకున్నట్లు - నేను నిన్నే లక్ష్యంగాపెట్టుకొని, శోధించి, నిన్ను చేరుకుంటాను అరుణాచలా!

**40. జ్ఞానములేక నీ యాశ దైన్యము బాప**
**జ్ఞానము దెల్పి బ్రోవరుణాచలా!**

తా. నిన్ను పొందాలనివుంది - కాని దారితెలియక అజ్ఞానముతో బాధపడుతున్నాను. నీ ఆత్మ జ్ఞానాన్ని నాకు బోధించి - ఈ దీనస్థితినుంచి నన్ను రక్షించు అరుణాచలా!

**41. తేటివలెను నీవు వికసింపలేదని**
**యెదుట నిలుతువేల యరుణాచలా!**

తా. మొగ్గను వికసింపజేయుశక్తి తేనెటీగకు లేదు కాబట్టి - మొగ్గ పువ్వుగా వికసించువరకు అది నిరీక్షిస్తూ ఉంటుంది - మరి నీవు తేనెటీగలాగ శక్తి హీనుడవు కాదుగదా? ఒకవేళ నేను పక్వానికి రాకపోతే నన్ను పక్వంచేయుటమాని - అలా తేనెటీగలాగ ఎదురుగానిలిచి చూస్తున్నా వేమిటి అరుణాచలా?

**42. తత్వమెరుగజాల నంతను నిలుతువే**

యిదియేమి తత్వమో యరుణాచలా?

తా. "ఉన్నది నీవొక్కడివే" నన్న నిజము తెలిసేవరకు - నీవు వేరుగా నీవుగానే ఉంటావు - ఇదియేమి తత్వమరుణాచలా?

43. తానేను తానను తత్వమిద్దానిని
తానుగా జూపింతు వరుణాచలా!

తా. "పొందాలని పరితపిస్తున్న ఆపరవస్తువు తనకంటే వేరుగా లేదన్న తత్వాన్ని తన స్వరూపముగా (తానుగా) చూపుతావు అరుణాచలా!

44. త్రిప్పియహంతను యెప్పుడు లో దృష్టి
గన తెలియు ననుదే యరుణాచలా!

తా. మనస్సును లోపలికి త్రిప్పి నిరంతరము అంతర్ముఖ దృష్టితో అహంకారముయొక్క మూలమును శోధిస్తే - అప్పుడు నీ స్వరూపమేమిటో తెలుస్తుంది అరుణాచలా!

45. తీరముండని యెద వెదకి తన్నునే
తిరిగి బొందితి బ్రోవు మరుణాచలా!

తా. హద్దులులేని అనంతమైన హృదయమును శోధించి - అక్కడ ప్రకాశిస్తున్న నిన్నే మరల

తిరిగిచేరుకున్న నన్ను కాపాడు అరుణాచలా!

**46. సత్యజ్ఞానములేని ఈ జన్మ ఫలమేమి**
**యెుప్పగ రావేల యరుణాచలా!**

తా. సత్యము తెలియకుండా, జ్ఞానము కలుగకుండా ఈ తనువు రాలిపోతే - ఈ జన్మవచ్చిన ఫలితమేమిటి? కనుక నన్ను జ్ఞానముతో అలంకరించు అరుణాచలా!

**47. శుద్ధ వాఙ్మన యుతులం దోచు నీ నిజా**
**హంత గల్పి నను బ్రో వరుణాచలా!**

తా. పరిశుద్ధమైన మాటకు, మనస్సుకు మాత్రమే అర్థమయ్యేడి ఆత్మగతమైన నీ నిజమైన "నేను"లో నన్ను కలుపుకొని కాపాడు అరుణాచలా!

**48. దైవమనుచు నిన్ను దరిజేరగా నన్ను**
**పూర్ణనాశమొనర్చి తరుణాచలా!**

తా. నీవేదో దేవుడని, నన్నేదో ఉద్ధరిస్తావనే ఆశతో నీ చెంతకు చేరితే - నీవు నా అహంకారాన్ని పూర్తిగా నాశనముచేశావు అరుణాచలా!

**49. వెదుకగ గనిన సచ్ఛ్రీయనుగ్రహ నిధీ**
**మది తెగుల్ తీర్చి బ్రోవరుణాచలా!**

తా. నీ కోసము శోధిస్తే - నీవు సత్ చిత్ అనుగ్రహ స్వరూపుడవని తెలిసినది. అట్టి నీవు - నా మనస్సును పట్టి పీడిస్తున్న రుగ్మతలనుంచి నన్ను రక్షించి నీ స్వరూపాన్ని నాకు ప్రసాదించు అరుణాచలా!

**50. ధైర్యము పరుగిడు నీ నిజాహ మరయ**
**నే నాశమైతి బ్రోవరుణాచలా!**

తా. ఎంతో గొప్పవాడినని గర్వముతో విర్రవీగుతున్న నేను - నీ స్వరూపాన్ని చూడగానే - నా ధైర్యము కాస్తా జారిపోయి నేను నశించిపోయాను అరుణాచలా!

**51. తాకి కృపాకరము నను కలియకున్న**
**నిజము నశియింతు బ్రోవరుణాచలా!**

తా. నీవు దయతో నన్నుతాకి, పక్వముచేసి, నీ స్వరూపములో కలుపుకోకపోతే - నేను పూర్తిగా పతనమైపోతాను అరుణాచలా! నన్ను రక్షించు అరుణాచలా!

**52. దోషరహిత నీవు నాతో నైక్యమయి ని**
**త్యానందమయ మొనర్పరుణాచలా!**

తా. దోషరహితుడవైన నీవు నన్నుకూడ నీఅంతటి వాడినిచేసి - నీలో ఐక్యముచేసుకొని, నీ నిత్య

ఆనందమయస్వరూపాన్ని నాకు ప్రసాదించు అరుణాచలా!

**53. నగకు యెడము కాదు నిన్వెదకిన నన్ను**
**గను కృపానగ వేసి యరుణాచలా!**

తా. బాహ్యమైన ఆభరణాలు ఏమీలేవని నన్ను నిర్లక్ష్యము చేయక - నిన్నే వెదకుచూ, నీ చెంతకు చేరిన నన్ను - నీ అనుగ్రహమనే ఆభరణముతో అలంకరించి చూసుకో అరుణాచలా!

**54. నానలేదె వెదుక నేనయి నీవొంటి**
**స్థాణువై నిలచితి వరుణాచలా!**

తా. నీకోసము నేను శోధించగా - నేను నశించి - నీవు ఒంటి స్థంభములాగ ఒక్కడివే నిలిచి యున్నావు అరుణాచలా!

**55. నీ జ్వాల గాల్చి నన్ నీరు సేసెడుమున్నె**
**నీ కృప వర్షింపు మరుణాచలా!**

తా. నేను నీ అంతటివాడినైన తరువాత నీ కృప నాకెందుకు అరుణాచలా? నీ జ్ఞానాగ్ని వచ్చి - నా అజ్ఞానాన్ని దహించి, నా అహంకారాన్ని హరించి నీ అంతటివాడిని చేయకముందే నీ

కృపను నాపైన కురిపించు అరుణాచలా!

56. **నీవు నే నణుగ నిత్యానంద మయముగ**
**నిలుచుస్థితి కరుణింపరుణాచలా!**

తా. "నీవు వేరు - నేను వేరు" అనెడి ద్వైతబుద్ధి నశించి - నిత్యమైన సత్యమైన ఆత్మానందములో నిరంతరము నేను నిలిచిపోయేటట్లు అనుగ్రహించు అరుణాచలా!

57. **అణురూపు నిన్ను నే మిన్ను రూపుం జేర**
**భావోర్ము లెపుడాగు నరుణాచలా!**

తా. అందరి హృదయములలో సూక్ష్మరూపమున స్వయముగా ప్రకాశిస్తున్న నీ చైతన్య సుఖ స్వరూపములో నేను కలియుటకు నీకూ-నాకు మధ్యన అడ్డుగావున్న ఈ తలంపులబాధనుంచి నన్ను ఎప్పుడు విడుదల చేస్తావు అరుణాచలా?

58. **సూత్రజ్ఞానము లేని పామరు నా మాయా**
**జ్ఞానము గోసి కా వరుణాచలా!**

తా. శాస్త్రజ్ఞానములేని పామరుడనైన నన్ను మాయ నుంచి బయటికి లాగి నా అజ్ఞానాన్ని కత్తిరించి, నన్ను రక్షించు అరుణాచలా!

59. **మక్కి మక్కి కరిగి నే నిన్ను శరణంద**

**నగ్నుడవై నిల్చి తరుణాచలా!**

తా. నీవు నన్నేదో ఉద్ధరిస్తావని శ్రమపడి నీ శరణుకోరి చెంతకు వస్తే - నీవు గుణరహితస్థితిలో అద్వైత శిఖరం మీద కూర్చున్నావు అరుణాచలా!

**60. నేస్తముండని నాకు నీయాశ జూపి నన్**
**మోసగింపక బ్రోవు మరుణాచలా!**

తా. ఏస్నేహాలూలేని నాకు - నీమీద ప్రేమ కలిగించావు. ఇప్పడు నీ ప్రేమమైకములో నన్నుపెట్టి మోసం చేయక - నీ మోహాన్ని కూడా నాలో కత్తిరించి కాపాడు అరుణాచలా!

**61. నవిసి చెడు ఫలము నందేమి ఫల మేరి**
**పక్వత లోగొను మరుణాచలా!**

తా. పక్వానికిరాక పాడైనపండును నీవుమాత్రం ఏం చేసుకుంటావు అరుణాచలా? నా బుద్ధిలోనున్న దోషాలను తొలగించి, నన్ను పక్వముచేసి - అప్పడు నీ సొంతం చేసుకో అరుణాచలా!

**62. నొవ్వగింపక నిన్ను నొసగి నన్ గొనలేదె**
**యంతకుడవు నాకు నరుణాచలా!**

తా. సాధనలపేరుతో నన్నేమీ శ్రమపెట్టకుండానే నీజ్ఞానాన్ని

నాకు ప్రసాదించి - నా అజ్ఞానాన్ని హరించి, అహంకారాన్ని హతమార్చావు అరుణాచలా!

**63. చూచి చింతించి మేనుందాకి పక్వము**
**చేసి నీవేలి బ్రో వరుణాచలా!**

తా. అరుణాచలా! ఒక్కసారి నావైపు చూడవయ్యా! నీవుచూసినా నాకు జ్ఞానమురాకపోతే - ఒక్కసారి నన్ను స్మరించు! నీవుస్మరించినా నాకు జ్ఞానమురాకపోతే - ఒక్కసారి నన్ను తాకి, నాబుద్ధిని పక్వముచేసి, నీ స్వరూపాన్ని నాకు ప్రసాదించి కాపాడు అరుణాచలా!

**64. మాయా విషము పట్టి తలకెక్కి చెడుమున్నె**
**కరుణపట్టొసగి బ్రో వరుణాచలా!**

తా. మాయ అనేవిషము నాతలకెక్కి నా బుద్ధిని నాశనము చేయకముందే నీకరుణామృతాన్ని నాపైన కురిపించి నన్ను రక్షించు అరుణాచలా!

**65. కను కృపన్ మాయాంతముగ కృపగనవేని**
**కను నీకెవరు చెప్పటరుణాచలా?**

తా. నాలోని అవిద్య పూర్తిగా అంతమయ్యేవరకు నీకృపను నాపైన కురింపించు! నీవు కృపచూపక పోతే నాకు దిక్కెవరు

అరుణాచలా? అందరికీ దిక్కు నీవేకదా? అట్టి నీకు చెప్పటానికి ఎవరు సరిపోతారు అరుణాచలా?

**66. పిచ్చివీడ నిను బోల్ పిచ్చిజేసితె దయన్**
**పిచ్చిని మాన్పు మందరుణాచలా!**

తా. నాకున్న లోకపిచ్చిని తీసివేయుటకు - నీమీద నాకు ప్రేమను కలిగించి, నీపిచ్చిని నాకు పట్టించావు! (నేను అద్వైతస్థితిని పొందకుండా అడ్డుగా ఉన్న) నీ పిచ్చినికూడా దయతో తీసివేయి అరుణాచలా!

**67. నిర్భీతి నినుజేరు నిర్భీతు ననుజేర**
**భీతి నీకేలకో యరుణాచలా?**

తా. భయాన్ని విడిచిపెట్టి అభయస్థితిలో నీచెంత చేరిన నన్ను నిర్భయముగా చేరదీయుటకు - నీకు భయమెందుకు అరుణాచలా?

**68. అల్పజ్ఞాన మదేది సుజ్ఞాన మేదయా**
**ఐక్యమంద కరుణింపరుణాచలా!**

తా. ఏది అజ్ఞానమో - ఏది సుజ్ఞానమో కూడా తెలియని నన్ను - నీవు కృపతో కరుణించి నీ స్వరూపములో కలుపుకో అరుణాచలా!

**69. పూ (భూ) గంధమగు మది పూర్ణగంధముగొన**
**పూర్ణగంధ మొసగు మరుణాచలా!**

తా. మొగ్గ పువ్వుగా మారితే ఎటువంటి పరిమళాన్ని వెదజల్లుతుందో - అదేవిధముగా భూమి మైకము లోపడి కొట్టుకుంటున్న నామనస్సును పక్వము చేసి, సుగుణములతో నింపి, పరిపూర్ణ స్థితిని నాకు ప్రసాదించు అరుణాచలా!

**70. పేరు దలపగనే పట్టి లాగితివి నీ**
**మహిమ కనుదురెవరరుణాచలా?**

తా. నేను "అరుణాచలా" అని నిన్ను స్మరించినంత మాత్రముచేతనే నన్ను అహంకారములోనుంచి బయటికి లాగివేశావుకదా! నీ మహిమ "యిట్టిది" అని ఎవరికి తెలుస్తుంది అరుణాచలా?

**71. పోగభూతము పోను భూతమై పట్టి నన్**
**భూతగ్రస్తుని జేసి తరుణాచలా!**

తా. నన్ను పట్టిపీడిస్తున్న అహంకారమనే భూతములో నుంచి నన్ను విడిపించుటకు - నీవు అంతకంటే పెద్దభూతమై నన్ను పట్టుకొని - నీప్రేమతో నన్ను దెయ్యంపట్టినవానిలాగ చేసావు అరుణాచలా!

**72. మృదులతన్ నేప్రాపులేక వాడగనీక**

**పట్టుకొమ్మయి కావు మరుణాచలా!**

తా. పందిరి ఆధారములేక వాడిపోయేమృదువైన పూల తీగలాగా నాజీవితాన్ని పాడుచేయక నా బ్రతుకునకు నీవే ఆధారమై నన్ను కాపాడు అరుణాచలా!

**73. పొడిచే మయికపర్చి నా బోధ హరియించి**
**నీ బోధ గనుపించి తరుణాచలా!**

తా. ఆపరేషన్ చేసేముందు బాధతెలియకుండా మత్తు మందు ఇచ్చినట్లు - నన్ను నీ మైకములో పెట్టి నాకు ఏమీబాధ తెలియకుండానే నా అజ్ఞానాన్ని తొలగించి - నీజ్ఞానాన్ని నాకు ప్రసాదించావు అరుణాచలా!

**74. పోకరాకలు లేని సమరంగదివి జూపు**
**మాకృపా పోరాట మరుణాచలా!**

తా. చావుపుట్టుకలకు అతీతమైన నీఆత్మ సామ్రాజ్యాన్ని ఒక్కసారి నాకు చూపించు అరుణాచలా! (నీ స్వరూప సుఖాన్ని రుచి చూసేవరకు ఈ చావు పుట్టుకలు మమ్ము విడిచి పెట్టవు అరుణాచలా! మరి నీ దయ లేకపోతే నీ ఆత్మ సామ్రాజ్యంలో మేము అడుగుపెట్ట గలమా?) సాధనల పేరుతో మేము పడుతున్న ఈ శ్రమ అంతా నీ దయ

కోసమే అరుణాచలా!

75. భౌతికమౌమేని పట్టార్చి యెపుడు నీ
మహిమ గన కరుణింపరుణాచలా!

తా. నన్ను పట్టిపీడిస్తున్న ఈ దేహబుద్ధినుంచి బయటికిలాగి - నిరంతరము నీ స్వరూప సుఖాన్ని అనుభవించేటట్లు నన్ను అనుగ్రహించు అరుణాచలా!

76. మలమందు నీవియ్య మలగుటయో కృపా
మలమందువై వెలుగరుణాచలా!

తా. కొండరూపమున వైద్యుడవు - మందువు కూడా నీవే అయ్యి, మా అహంకారాలను హరించుటయే పనిగా పెట్టుకున్న నీవు - మమ్మల్ని జీవ లక్షణాలతో జీవించనిస్తావా అరుణాచలా? - జీవించనీయవు! నీ కరుణామృతమే కొండ రూపమున మందుగా వెలుగొందు అరుణాచలా!

77. మానముగొని చేరువారి మానము బాపి
నిరభిమానత వెలుగరుణాచలా!

తా. దేహాభిమానముతో నీ చెంతచేరు భక్తుల అహంకారాన్ని హరించి, నీవు మాత్రం నిరహంకారముగా నిలిచిపో అరుణాచలా!

78. మించగా వేడెదు కించిజ్ఞుడను నను
వంచింపకను బ్రోవరుణాచలా!

తా. నేను పూర్తిగా పతనమై అన్నీ మించిపోయిన తరువాతనే నిన్ను ప్రార్థించే పెద్దమూర్ఖుడను. అయినప్పటికీ నన్ను హేళనచేసి విడిచిపెట్టక రక్షించు అరుణాచలా!

79. నావికుడుండక పెనుగాలి నలయు నా
వనుగాక కాచి బ్రోవరుణాచలా!

తా. సంసారసాగరంలో శోకాలసుడిగుండములో మునిగిపోతున్న నన్ను - నావికుడు లేక నడి సముద్రమున పెనుతుఫానులో చిక్కుకొని తల్లడిల్లు నావలాగ నన్ను విడిచిపెట్టక - నీవే దిక్కై నన్నురక్షించి కాపాడు అరుణాచలా!

80. ముడిమూలముల్‌గాన మునుకొంటివి సరిగ
ముగియ భారము లేదొ యరుణాచలా?

తా. సర్వ అనర్థములకు మూలమైనట్టి నా చిజ్జడ గ్రంథిని కత్తిరించుట మొదలు పెట్టావు - మరి ప్రారంభించిన పనిని కడకంటు పూర్తి చేయువలసిన బాధ్యత నీకులేదా అరుణాచలా?

81. ముక్కిడి మునుజూపు ముకురముగాక నన్

**హెచ్చించి కౌగిలిం పరుణాచలా!**

తా. ముక్కు వంకర ఉన్నవాడిచేతికి అద్దమిచ్చి "నీ ముక్కు చూసుకోమని హేళనచేసినట్లుచేయక - నాలో లోపాలువుంటే వాటిని తొలగించి, నన్ను కూడా నీ అంతటివాడిని చేసి, నన్ను నీలో కలుపుకో అరుణాచలా!

**82. సత్యాహమున మనో మృదుపుష్పశయ్యపై**
**మేన్గలయ కరుణింపరుణాచలా!**

తా. నా మనస్సును మృదువైనపూలపాన్పుగా చేసుకొని దేహగతమైన నా "నేను"ను, సత్యగతమైన నీ "నేను"లో కలుపుకొని కాపాడు అరుణాచలా!

**83. మీదు మీదుగ మ్రొక్కు భక్తుల జేరి నీ**
**వందితే మేలిమి యరుణాచలా!**

తా. ఎందరెందరో భక్తులు నిన్ను ఎంతగానో పూజించి, నీ ఘనతను పొగిడారుగాబట్టే - నీకింతకీర్తి వచ్చినది అరుణాచలా!

**84. మైమైదణచి కృపాంజనమున నీ సత్య**
**వశమొనరించితి వరుణాచలా!**

తా. నీ కృపాంజనముతో నాఅజ్ఞానాంధకారాన్ని పోగొట్టి

నీఆత్మస్వరూపములో నన్ను కలుపుకున్నావు అరుణాచలా!

**85. మొగ్గ (బోడి) పఱపి నను బట్టబయట నీవు నట్టాడుటేలకో యరుణాచలా!**

తా. నాఅహంకారాన్ని నాశనముచేసిన నీవు నా హృదయములో నాట్యము చేయుటమాని - అలా బయట తారాడుతున్నావేమిటి అరుణాచలా?

**86. మోహము త్రిప్పి నీ మోహమొనర్చి నా మోహము తీరదా యరుణాచలా?**

తా. ప్రకృతి మైకములోనున్న నాకు నీప్రేమను రుచి చూపించి, నీమీద నాకు మోహము కలిగించావు. మరి "నిన్ను - నన్ను" వేరు చేస్తున్న ఈ నీ మోహములోనుంచి నన్నెప్పుడు విడుదలచేస్తావు అరుణాచలా?

**87. మౌనియై రాయిగా నలరకనున్న చో మౌనమిది యగునో యరుణాచలా?**

తా. మాటామంచీలేకుండా రాయిలాగ అలా కదలకుండా, మెదలకుండా కొండలాకూర్చుంటే - అది మౌనమౌతుందా అరుణాచలా?

**88. ఎవరు నా నోటిలో మన్నును గొట్టి నా**

**బ్రతుకు హరించిన దరుణాచలా?**

తా. ఇంటిపట్టున సుఖంగావున్న నన్ను ఇక్కడికి ఈడ్చు కొనివచ్చి - నాఅహంకారాన్ని హతమార్చి నా జీవలక్షణాలను హరించినదెవరు అరుణాచలా?

**89. ఎవరు గనుక నాదు మదిని మైకపరిచి**
**కొల్లగొనిన దెవరరుణాచలా?**

తా. నామనస్సును మైకంలోపెట్టి - నాకు తెలియకుండానే నాఅజ్ఞానాన్ని దోచుకున్నది ఎవరు అరుణాచలా?

**90. రమణుడనుచు నంటి రోషము గొనక నన్**
**రమియింపజేయ రమ్మరుణాచలా!**

తా. రమణుడు ఇటువంటి నిందలు వేస్తున్నాడేమిటని కోపగించుకోక - నన్నుకూడా నీ అంతటివాడిని చేయి అరుణాచలా!

**91. రేయింబవలు లేని బట్టబయటి యింట**
**రమియింపగా రమ్ము అరుణాచలా!**

తా. "రాత్రి - పగలు, లోపల - బయట" అనునవి లేనటువంటి నీఅనంతమైన ఆత్మస్వరూపములో నన్ను కలుపుకొని యేలుకో అరుణాచలా!

**92. లక్ష్యముంచి యనుగ్రహాస్త్రమువైచి నన్**
**కబళించి తుసురుతో నరుణాచలా!**

తా. నన్ను లక్ష్యంగాపెట్టుకొని, నీకృపను నాపైన కురిపించి నేను జీవించిఉండగానే నాఅహం కారాన్ని పూర్తిగానాశనముచేసావు అరుణాచలా!

**93. లాభమీ విహపరలాభహీనుని జేరి**
**లాభమే మందితీ వరుణాచలా!**

తా. ఈలోకానికిగాని - పరలోకానికిగాని పనికిరాని ఈ లాభహీనుడిని పొంది - నీవేమి లాభం పొందావు అరుణాచలా?

**94. రమ్మని యనలేదె వచ్చి నా వంతివ్వ**
**వెలకు నీ తలవిధి యరుణాచలా!**

తా. నీవు రమ్మంటేనేకదా నేను నీచెంతకు వచ్చాను? ఒకవేళ నాలో లోపాలు ఉన్నప్పటికీ వాటినిచూసి నీవు భయపడక నన్ను బాగుచేసి - నీ స్వరూప సుఖాన్ని నాకు ఇవ్వవలసిన బాధ్యత నీమీద వుంది అరుణాచలా!

**95. రమ్మని లోదూరి నీజీవమిడునాడె**
**నా జీవమును బాసి తరుణాచలా!**

తా. నన్ను నీచెంతకు రమ్మని - నీవు నాలో

ప్రవేశించి, నీజ్ఞానాన్ని నాకు ప్రసాదించినవాడే - నా జీవ లక్షణాలను విడిచిపెట్టాను అరుణాచలా!

**96. విడిచిన కష్టమౌ విడక నిన్ను సురును**
**విడువ యనుగ్రహిం పరుణాచలా!**

తా. ఇప్పుడు నిన్ను విడిచిపెట్టి నేను ఇక జీవించలేను అరుణాచలా! కనుక నేను నిన్ను విడిచి పెట్టక ముందే నాప్రాణము పోవునట్లు అనుగ్రహించు అరుణాచలా!

**97. ఇల్లు విడువ లాగి లోనింటి లోజొచ్చి**
**యొగి నీదు యిలుజూపి తరుణాచలా!**

తా. నన్ను అహంకారమనే ఇంటిలోనుంచి బయటికి లాగి - నీవు నాహృదయములో ప్రవేశించి, నీ ఆత్మ సామ్రాజ్యములో నన్ను కలుపుకున్నావు అరుణాచలా!

**98. వెలిపుచ్చితి నీ్నదుసేత కినియక నీ**
**కృపవెలిబుచ్చి కావరుణాచలా!**

తా. నీ ఔన్నత్యమిట్టిదని వెల్లడిచేసి అల్లరి చేస్తున్నానని అలుగక - నీకృపను నాపైన కురిపించి నన్ను కాపాడు అరుణాచలా!

**99. వేదాంతమున వేరు లేక వెలింగెడు**
**వేదపదమ బ్రోవు మరుణాచలా!**

తా. స్వయంప్రకాశమైన ఏఅద్వైతసద్వస్తువును గూర్చి వేదముల అంతిమభాగములో వర్ణింపబడినదో - అట్టి పరబ్రహ్మస్వరూపాన్ని నాకు ప్రసాదించు అరుణాచలా!

**100. నింద నాశీస్సుగా గొని దయాపాత్రుగ**
**జేసి విడకకావు మరుణాచలా!**

తా. తెలిసో - తెలియకో నిన్ను నేను నిందించినప్పటికీ - నీవు నన్ను మధ్యలోవిడిచిపెట్టక నానిందను కూడా నీవు ఆశీస్సుగానే స్వీకరించి, నీకృపను కురిపించి, నన్ను రక్షించు అరుణాచలా!

**101. నీట హిమముగ ప్రేమాకారు నీలో నన్**
**ప్రేమగ కరగిబ్రో వరుణాచలా!**

తా. మంచుగడ్డ నీటిలోకరిగి నీటిలోనీరుగా కలిసి పోయినట్లు - ప్రేమస్వరూపుడవైన నీవు, నీప్రేమతో నాఅహంకారాన్ని కరిగించి నీస్వరూపములో నన్నుకూడా కలుపుకో అరుణాచలా!

102. అరుణాద్రియన నే కృపావలబడితి త
ప్పనే నీ కృపావల యరుణాచలా?

తా. "అరుణాచలా" అని నిన్ను స్మరించినంత మాత్రముచేతనే నీ "కృప" అనే వలను నాపైన విసిరావు! నీకృపావలలో పడినవాడు రక్షింప బడకుండా ఎలా ఉండగలడు అరుణాచలా?

103. చింతింప కృపపడ సాలీడువలె గట్టి
చెరపెట్టి భక్షించి తరుణాచలా!

తా. తనగూటిలో చిక్కుకున్న కీటకాన్ని సాలిపురుగు ఏవిధముగాపట్టుకుని భక్షిస్తుందో - అదేవిధముగా నిన్ను స్మరించినంతమాత్రము చేతనే నీకృపను నాపైన కురిపించి, నా అహంకారాన్ని హరించావు అరుణాచలా!

104. ప్రేమతో నీనామ మాలించు భక్త
భక్తుల భక్తుగా బ్రోవు మరుణాచలా!

తా. నీ అరుణాచలనామామృతాన్ని ప్రేమతో ఆలపించు భక్తులయొక్క భక్తులకైనా నన్ను భక్తునిగా చేయి అరుణాచలా!

105. నను బోలు దీనుల నింపొందకాచుచు

**చిరజీవివై బ్రోవు మరుణాచలా!**

తా. నన్ను ఏవిధముగారక్షించావో - అదేవిధముగా నీ పొందుకోరివచ్చు నాలాంటిదీనులను రక్షిస్తూ - నీవు కలకాలం చిరకాలం చిరంజీవిగా నిలిచిపో అరుణాచలా!

**106. ఎముకలరుగు దాసు మృదువాక్కు విను చెవిన్**
**గొనుమ నా యల్పోక్తులరుణాచలా!**

తా. పూర్వము ఎందరోభక్తులు నీ ఘనతను కీర్తిస్తూ ఎముకలుకూడా కరిగిపోయే కవిత్వాన్ని చెప్పారు. అట్టి మధురమైనమాటలను ఆలకించిన నీ చెవులతో - నా ఈచిన్నిచిన్నిమాటల్నికూడ ఆలకించు అరుణాచలా!

**107. క్షమగల గిరి యల్పవాక్కు సద్వాక్కుగా**
**గొని కావు మరి యిష్ట మరుణాచలా!**

తా. నీవు పైకి కొండరూపమున కనిపిస్తున్నప్పటికీ - గొప్ప ఓర్పుగలవాడివి కదా? కనుక నేను చెప్పే ఈచిన్నిచిన్నిమాటలు నీకు రుచించనప్పటికీ - వాటిని యిష్టంచేసుకొని గొప్పమాటలుగా

స్వీకరించు అరుణాచలా!

108. మాలను దయచేసి యరుణాచలరమణా

నామాల దాల్చి బ్రోవరుణాచలా!

తా. నీ అనుగ్రహమను మాలను నాకు ప్రసాదించి - ఈఅరుణాచలరమణుడు అక్షరములతో కూర్చిన ఈపెండ్లిమాలను నీవు స్వీకరించి నన్ను కాపాడు అరుణాచలా!

అరుణాచలశివ - అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచలా!

అరుణాచల శివ - అరుణాచల శివ - అరుణాచల శివ -

అరుణాచలా!

మంగళ మరుణాచలమునకు

మంగళము భక్తశ్రేణికి

మంగళ మక్షరమణమాలకును

జయ మంగళం!

# శ్రీ రమణ సూత్రాలు

కర్మే ప్రధానమని భ్రమపడి, యజ్ఞయాగాది క్రతువులతో తమ కోరికలను సంతృప్తిపరచుకుంటూ, కర్మఫలప్రదాత అయిన పరమేశ్వరుని విస్మరించి, గర్వముతో విర్రవీగుతున్న దారుకావన ఋషులకు కనువిప్పు కలిగించి, వారి ప్రార్థనను మన్నించి, కరుణామయుడైన పరమేశ్వరుడు వారికి బోధించిన "ఉపదేశ సారము"ను భగవాన్ శ్రీ రమణమహర్షుల వారు తమ స్వహస్తములతో వ్రాసినారు. ఆ "**ఉపదేశ సారము**"నకు వ్యాఖ్యానమే ఈ "రమణ సూత్రములు".

1. **కర్తు రాజ్ఞయా ప్రాప్యతే ఫలం।**
**కర్మ కిం పరం? కర్మత జ్జడం॥**

తా. ఈశ్వరుని ఆజ్ఞననుసరించి కర్మఫలితము వస్తుందే గాని - కర్మకు ఫలితమునిచ్చు శక్తిలేదు. కర్మ పరవస్తువుకాదు - అది జడవస్తువే!

2. **కృతి మహోదధౌ పతన కారణం।**
**ఫల మశాశ్వతం గతి నిరోధకం॥**

తా. కర్మఫలితము అశాశ్వతము మాత్రమే కాక - అది కర్మసముద్రములో ముంచి, మోక్షమువైపు

ముఖము తిరగనివ్వకుండా మార్గమును నిరోధించి, పతనానికి హేతువు అగుచున్నది.

3. **ఈశ్వరార్పితం నేచ్ఛయాకృతం।**
**చిత్త శోధకం ముక్తి సాధకం॥**

తా. ఫలితమును పరమేశ్వరునికి అర్పించి, రాగ ద్వేష రహితముగా కర్మనాచరిస్తే - ఆ కర్మ మనస్సును శుద్ధిచేస్తుంది. ముక్తికి దారి చూపుతుంది.

4. **కాయవాఙ్మనః కార్యముత్తమం।**
**పూజనం జప శ్చింతనం క్రమాత్॥**

తా. ఈశ్వరారాధనలో దేహముతోచేయు పూజకంటే - నోటితోచేయు జపము, జపముకంటే - మనస్సుతో చేయు చింతన ఉత్తమమైనవి. కనుక చేతులతోచేయు పూజకంటే - నోటితోచేయు జపము, జపముకంటే - మనస్సుతోచేయు ధ్యానము శ్రేష్ఠమైనవి.

5. **జగత ఈశధీ యుక్త సేవనం।**
**అష్టమూర్తి భృద్దేవపూజనం॥**

తా. పంచభూతములు, సూర్యచంద్రులు, సకల

జీవులు ఈశ్వరునిస్వరూపముగా భావించి, సృష్టిని సేవిస్తే - అది పరమేశ్వరుని పూజించినట్లే!

6. **ఉత్తమస్తవా దుచ్ఛమందతః**
**చిత్తజం జపధ్యానముత్తమం॥**

తా. ఈశ్వరనామములను ఉచ్ఛరించుట ఉత్తమ స్తోత్రము. కాని ఈశ్వరుని నామములను పెదవు లతో బిగ్గరగా ఉచ్ఛరించుటకంటె - పెదవులు కదలీ కదలనట్లుగా చేయు జపము - దానికంటే నిశ్శబ్ధముగా చేయు స్మరణ - అంతకంటే మానసికముగా చేయు ధ్యానము ఒకదానికంటే ఒకటి శ్రేష్ఠమైనవి.

7. **ఆజ్యధారయా స్రోతసా సమం।**
**సరళ చింతనం విరళతః పరం॥**

తా. నేతి ధారవలె, నీటి ప్రవాహమువలె ఎడతెగక ఈశ్వర-చింతనచేయుట సరళచింతన, మధ్య మధ్యన ఆగిపోవు విరళచింతనకంటే - సరళ చింతన శక్తివంతమైనది.

8. **భేదభావనాత్ సోహమిత్యసా।**
**భావనా భిదా పావనీమతా॥**

తా. "ఈశ్వరుడు వేరు - తాను వేరు" అనెడి భేదభావన కంటే "ఈశ్వరుడు - తాను ఒక్కటే" అనెడి అభేద భావన సర్వోత్కృష్టమైనది.

9. **భావశూన్య సద్భావసుస్థితిః**
**భావనాబలా ద్భక్తి రుత్తమా॥**

తా. దేహభావనను విడిచి, ఆత్మభావనలో స్థిరముగ నిలిచి చింతనచేయుట వలన - భావనకు అతీతమైన పరమస్థితి చేకూరుతుంది. ఇదియే ఉత్తమమైన భక్తి!

10. **హృత్‌స్థలేమనః స్వస్థతాక్రియా।**
**భక్తి యోగబోధాశ్చ నిశ్చితం॥**

తా. మనస్సును దాని పుట్టుచోటైన హృదయ స్థానము నందు నిలిపి ఉంచుటయే కర్మభక్తి ధ్యానజ్ఞాన యోగముల సారము - ఇది నిశ్చయము.

11. **వాయురోధనాల్లీయతే మనః**
**జాలపక్షివద్రోధసాధనం॥**

తా. శ్వాసను నిరోధించుటవలన మనస్సు యొక్క చలనము ఆగి - వలలోచిక్కిన పక్షివలె ఆది

అణిగివుంటుంది. మనస్సును నిగ్రహించుటకు ఇది కూడా ఒక ఉపాయము.

12. చిత్తవాయవశ్చిత్క్రియాయుతాః
శాఖయోర్ద్వయీ శక్తి మూలకా॥

తా. ఉన్నది ఆత్మ ఒక్కటే! ఆత్మనుంచే మనస్సు - ప్రాణము పుట్టుచున్నవి. ఆత్మశక్తి ఆధారముగానే ఇవిరెండూ పనిచేయుచున్నవి. ఇవిరెండూ ఆత్మకు రెండుకొమ్మల వంటివి.

13. లయవినాశనే ఉభయరోధనే,
లయగతం పునర్భవతినోమృతం॥

తా. మనస్సును నిరోధించుటకు - "లయము - వినాశము" అను రెండుమార్గములుకలవు. లయమైనమనస్సు మరల తిరిగి విజృంభిస్తుంది - నాశనమైనమనస్సు మాత్రము ఇక తిరిగిపుట్టదు.

14. ప్రాణబంధనా ల్లీనమానసం,
ఏక చింతనా న్నాశమేత్యదః॥

తా. ప్రాణమును (శ్వాసను) నిరోధించుటవలన మనస్సు లయమౌతుంది - ఏకవస్తువును (ఆత్మను) ధ్యానించుటవలన మనస్సు నశిస్తుంది.

**15. నష్టమానసోత్కృష్టయోగినః**
**కృత్యమస్తికిం స్వస్థితిం యతః?॥**

తా. మనస్సు నశించినవాడే ఉత్తమమైన యోగి! మనస్సు నశించి స్వరూపస్థితిని పొందినట్టి యోగికి ఇక చేయవలసినపని ఏమివుంటుంది? - (పని ఉండదు)

**16. దృశ్యవారితం చిత్త మాత్మనః**
**చిత్త్వదర్శనం తత్త్వదర్శనం॥**

తా. మనస్సును బాహ్య విషయములవైపుపోనీయక నిరోధించి, ఆత్మలో స్థిరముగా నిలిపిఉంచితే - ఆత్మ తనస్వరూపముగా అనుభవమునకు వచ్చును. ఇదియే తత్త్వదర్శనము.

**17. మానసంతుకిం? మార్గణేకృతే,**
**నైవమానసం మార్గ ఆర్జవాత్॥**

తా. "మనస్సు అనునది ఉన్నదా?" అని శోధించుట మొదలుపెడితే - అసలు మనస్సు అనేది లేదని తెలుస్తుంది - ఇది సూటిమార్గము.

**18. వృత్త యస్త్వహం వృత్తి మాశ్రితాః**
**వృత్తయో మనో, విద్ధ్యహం మనః॥**

తా. "నేను" అను తలంపే అహంకారము. ఈ అహంకారమునకే మిగిలిన అన్నితలంపులు వచ్చుచున్నవి. ఈతలంపులమూటే మనస్సు! కనుక అహంకారమునకు వేరుగా మనస్సులేదు.

**19. అహమయంకుతో భవతి చిన్వతః।**
**అయిపతత్యహం నిజ విచారణం॥**

తా. ఈ "నేను" అను తలంపు (అహంకారము) ఎక్కడ పుట్టుచున్నదో వెదకి, దాని పుట్టుచోటు కన్గొనిన- ఈ "నేను" (అహంకారము) పడిపోతుంది - ఇదియే నిజ (ఆత్మ) విచారణ.

**20. అహమినాశభా జ్యహ మహంతయా।**
**స్ఫురతి హృత్స్వయం పరమ పూర్ణసత్॥**

తా. ఈ అహంకారగతమైన "నేను" ఎక్కడైతే అణిగి పోతుందో - అక్కడే పరిపూర్ణమైన పరవస్తువు స్వయముగా (ఆత్మగతమైన నేనుగా) స్ఫురిస్తుంది.

**21. ఇద మహంపదాభిఖ్య, మన్వహం।**
**అహమిలీనకే ప్యలయసత్తయా॥**

తా. అహంకారగతమైన నేను లేనట్టి నిద్రస్థితి

యందు కూడా ఆత్మగతమైన నేను ఉంది. కనుక ఆత్మగత మైన "నేనే" నిజమైన, నిత్యసత్యమైన నేను.

**22. విగ్రహేంద్రియ ప్రాణధీ తమః**
**నాహ, మేకసత్, తజ్జడం హ్యసత్॥**

తా. జడమైన దేహము, ఇంద్రియములు, ప్రాణము, బుద్ధి, తమస్సు మనము కాదు - చైతన్యమైనట్టి ఆ ఆత్మగతమైన "నేనే" మనమైయున్నాము.

**23. సత్త్వభాసికా చిత్క్వ వేతరా।**
**సత్తయా హిచిత్, చిత్తయా హ్యహం॥**

తా. స్వయముగా ప్రకాశిస్తున్న ఆచైతన్యమునకు వేరుగా జ్ఞానము లేదు - ఆసత్యవస్తువే నిజమైన జ్ఞానము - ఆజ్ఞానమే నిజమైన "నేను".

**24. ఈశజీవయో ర్వేషధీ భిదా।**
**సత్స్వ భావతో వస్తు కేవలం॥**

తా. జీవుడు - ఈశ్వరుడు వేరుకాదు. ఆత్మకువేరుగా వారులేరు. ఉపాదులనుబట్టి జీవేశ్వరులు వేరుగా కనిపిస్తున్నప్పటికీ - వారికి ఆధారముగానున్న సత్యవస్తువు ఆత్మఒక్కటే.

25. వేషహీనత స్వాత్మ దర్శనం।
ఈశదర్శనం స్వాత్మ రూపతః॥

తా. రూపదృష్టినిదాటితే స్వరూపము దర్శనమిస్తుంది - ఈశ్వరుడు తనస్వరూపముగా తెలియబడతాడు.

26. ఆత్మ సంస్థితిః స్వాత్మ దర్శనం।
ఆత్మనిర్ధ్వయా దాత్మ నిష్టతా॥

తా. ఆత్మనిష్టలో స్థిరముగా ఉండుటవలన స్వరూపము దర్శనమిస్తుంది. అట్టి ఆత్మనిష్ఠలో స్థిరముగా ఉన్నవాడికి ఆత్మకంటేవేరుగా మరొకటిలేదు.

27. జ్ఞానవర్జితా జ్ఞానహీనచిత్।
జ్ఞాన; మస్తికిం జ్ఞాతు మంతరం॥

తా. జ్ఞానము - అజ్ఞానము అనునది లేనట్టిదే నిజమైన చైతన్యము. అట్టి చైతన్యస్థితియందు తెలుసు కొనుటకు చైతన్యమునకు వేరుగా మరొకటి లేదు.

28. "కిం స్వరూప" మిత్యాత్మదర్శనే।
అవ్యయా భవా పూర్ణచిత్సుఖం॥

తా. స్వరూపమును దర్శించినవాడికి - ఆత్మ నాశనము లేని, పుట్టుకలేని, పరిపూర్ణమైన సుఖ

చైతన్య స్వరూపముగా దర్శనమిస్తుంది.

**29. బంధముక్త్యతీతం పరం సుఖం।**

**విందతీహాజీ వస్తు దైవికః॥**

తా. తన స్వరూపమును దర్శించిన పుణ్యచరితుడు "బంధానికి - ముక్తికి" అతీతమైన పరమసుఖాన్ని పొందుతాడు.

**30. అహమ పేతకం నిజవిభానకం।**

**మహదిదం తపో, రమణ వాగియం॥**

తా. అహంకారము నశించినచోటనే నిజము (ఆత్మ) ప్రకాశిస్తుంది. అహంకారము లేనట్టి అట్టి నిజ మందు స్థిరముగ నిలిచి ఉండుటయే గొప్ప తపస్సు - ఇది శ్రీ రమణుల వాక్కు!



# నేను ఎవడను?

సకల జీవులు దుఃఖ మనునది లేక ఎప్పుడును సుఖముగా నుండగోరుటచేతను, ప్రతి వ్యక్తికి తనయందే పరమప్రీతి యుండుట చేతను, ప్రీతికి సౌఖ్యమే కారణమగుటచేతను, ప్రతి దినమును, మనస్సడిగిన నిదురయందు, అనుభవించు నట్టిదియు, తన స్వభావమును నగు నా సుఖమును పొందవలసిన యెడల తన్ను తానెఱుగుట ఆవశ్యకము. దానికి "నేను ఎవడను?" అను జ్ఞానవిచారమే ముఖ్య సాధనము.

## 1. నేనెవడను?

సప్తధాతువులచే నేర్పడిన స్థూలదేహమును 'నేను'గాను. శబ్ధ, స్పర్శ, రూప, రస గంధములను పంచవిషయములను వేర్వేరుగ తెలిసికొను శ్రోత్ర, త్వక్, చక్షు, జిహ్వా, ఘ్రాణములను జ్ఞానేంద్రియములు అయిదును 'నేను' గాను.

వచన, గమన, అదాన, మలవిసర్జన, ఆనందములను నైదు కార్యములను జేయునట్టి వాక్కు, పాద, పాణి, పాయు, ఉపస్థలను కర్మేంద్రియములైదును 'నేను' గాను. శ్వాసాది పంచవ్యాపారములను జేయు

ప్రాణాది వాయుపంచకమును 'నేను'గాను. తలచెడు మనస్సును 'నేను' గాను. విషయవాసనలతో మాత్రము గూడి, సర్వ విషయములను సర్వ వ్యాపారములను వదలియుండు అజ్ఞానమును 'నేను'గాను.

**2. పైన చెప్పినవన్నియు "నేను" గా ననినచో, అప్పుడు నేనెవడను?**

వీనినన్నిటిని ('నేతి') కాదని ప్రత్యేకముగ నిలుచు ఎఱుకయే 'నేను'.

**3. ఎఱుక స్వరూపము ఏమి?**

ఎఱుక స్వరూపము సచ్చిదానందము.

**4. స్వరూప దర్శన ప్రాప్తి ఎప్పుడగును?**

దృశ్యముగానున్న జగత్తు కనబడకపోయినప్పుడు ఆ దృక్కు యొక్క అనగా స్వరూపము యొక్క దర్శనమగును.

**5. జగత్తున్నప్పుడు (చూడబడినప్పుడు) స్వరూప దర్శనం కాదా?**

కాదు.

**6. ఏల?**

దృక్కును దృశ్యమును, రజ్జు సర్పములవలెనున్నవి. కల్పిత సర్పజ్ఞానము పోయినగాని అధిష్ఠాన రజ్జుజ్ఞానము కలుగకుండునట్లు కల్పితమైన జగద్దృష్టి వీడిన గాని అధిష్ఠాన స్వరూపదర్శనము కాదు.

**7. దృశ్యమగుచున్న జగత్తు ఎప్పుడు అణగును?**

సర్వ విషయజ్ఞానములకు, సర్వవ్యాపారములకు కారణమగుచున్న మనస్సణగినప్పుడు జగమంతర్ధాన మగును.

**8. మనస్సు స్వరూపమేమి?**

మనస్సాత్మస్వరూపమునందున్న యొక అతిశయ శక్తి. దాని నుండియే అన్ని తలపులు తోచుచున్నవి. అన్ని తలంపులను త్రోసివేసినపుడు మనస్సనునది వేఱుగా లేదు. కనుక తలంపే మనస్సు స్వరూపము. జగత్తను నదియు తలంపుల కన్న వేఱుగా లేదు. నిదురలో తలంపులు లేవు. జగత్తును లేదు. జాగ్రత్తు లోను స్వప్నములోను తలంపులు కలవు; జగమును కలదు. సాలీడు తననుండియే సన్నని నూలును వెలికితెచ్చి దానిని మఱల తనలోనికే తీసికొనును; ఆ విధముగానే మనస్సుగూడ తన

నుండియే జగత్తును కల్పించి దానిని మఱల తనయందే లయము పొందించును. ఆత్మ స్వరూపమునుండియే మనస్సు వెలివడినయెడల జగము కనపడుచున్నది. కావున జగము కనవచ్చి నప్పడు స్వరూపము కనరాదు; స్వరూపము కనపడినపుడు (ప్రకాశించినపుడు) జగత్తు కనరాదు. మనస్సు స్వరూపమును గూర్చి విమర్శించి నపుడు తుదకు మనస్సు 'తాను'గానయిపోవును. 'తా'ననగా ఆత్మస్వరూపవే. మనస్సెప్పడును స్థూలరూపము ననుసరించియే యుండును. తాను వేఱుగా నుండదు. మనస్సే సూక్ష్మశరీరమని జీవుడని చెప్పబడుచున్నది.

## 9. మనస్సు స్వరూపమును విమర్శించి తెలిసి కొను మార్గమేది?

ఈ శరీరములో 'నేను' అని స్ఫురించునది యేదో అదే మనస్సు. 'నే'నను తలంపు దేహములో నెక్కడ మొదట స్ఫురించునో విచారించినట్లైన హృదయమున నని తెలియవచ్చును. అదియే మనస్సు పుట్టుచోటు. 'నేను' 'నేను' అని మననముచేయుచు నుండినను నా చోటికే తీసికొనిపోయి చేర్చును.

'నే'నను తలంపే మనస్సులో తోచు తలంపులన్నిటిలో మొదటిది. ఆ తలంపుదయించిన తర్వాతనే లెక్కలేని తలంపు లుదయించుచున్నవి. 'నేను' అను నుత్తమపురుష తోచిన తర్వాతనే 'నీవు' 'వాడు' అను మధ్యమ ప్రథమ పురుషలు తోచును. ఉత్తమ పురుష లేక మధ్యమ, ప్రథమ పురుషలుండవు.

## 10. మనస్సెట్లణుగును?

'నేను ఎవడను?' అను విచారణచేతనే మనస్సు అణగును. 'నేను ఎవడను?' అను తలపు ఇతరములైన తలంపులనన్నింటిని నాశనము చేసి శవమును దహించు కొఱవికట్టెవలె తానును నశించును. ఆ తర్వాత స్వరూపదర్శనమగును.

## 11. "నేను ఎవడను?" అను తలపును సదా అవలంభించుటకు ఉపాయమేది?

వేఱుతలంపు లుదయించినను వానిని పూర్తిగ కొనసాగించుటకు యత్నింపక, "అవి యెవరికి గలిగినవి" అని విచారింపవలెను. ఎన్ని తలంపులు తోచినను దాని వలన నేమి? జాగ్రత్తగ ఒక్కొక్క తలంపు కల్గినతోడనే "ఇది ఎవరికి గల్గినది" అని

విచారించినట్లయిన 'నా'కని తోచును. "నేను ఎవడను?" అని ప్రశ్నించుకొనినచో మనస్సు తాను పుట్టిన చోటునకు మఱలివచ్చును. వచ్చిన తలంపును అణగిపోవును. అట్లే అభ్యాసము చేయను చేయను మనస్సునకు తన జన్మస్థానమున నిలిచియుండు శక్తి యధికమగును. సూక్ష్మమైన మనస్సు మెదడు నుండియు ఇంద్రియముల ద్వారాను బయట వ్యాపించునపుడు స్థూలమైన నామరూపములు తోచుచున్నవి. అది హృదయమున నిలిచియుండు నపుడు నామ రూపములు కనుమరుగగుచున్నవి. మనస్సును బయటికి పోనీయక హృదయమున నిలుపుకొనుటకే "అహంముఖము" లేక "అంతర్ముఖము" అని పేరు. హృదయము నుండి దానిని వెలికి బోనిచ్చుటయే "బహిర్ముఖ" మనబడును. ఇట్లు మనస్సు హృదయమున నిలిచినట్లయిన తలంపు లన్నిటికి మూలమగు "నేను" తలంపుపోయి ఎప్పడు నుండు "తాను" మాత్రము ప్రకాశించును. ఏది చేసినను "నే"నను అహంకారము లేకయే చేయ వలెను. ఆ విధముగ చేసినచో సర్వము శివస్వరూప

ముగ తోచును.

## 12. మనస్సు అణుగుటకు వేరు ఉపాయములు లేవా?

మనస్సణగుటకు విచారణ తప్ప సమర్థము లయిన వేఱుపాయములు లేవు. ఇతరోపాయములచే మనస్సణగినను, అణగినట్లే యుండి అది మరల తలచూపును. ప్రాణాయామము చేతను మనస్సణగి నను ప్రాణమణగియుండు వఱకు మనస్సును అణగి యుండి, ప్రాణము బయలువెడలినపుడు తానును బయలువెడలి వాసనల వశమై అనేక ముఖముల వ్యాపించును. మనస్సునకు ప్రాణమునకు పుట్టు చోటొక్కటే. తలంపే మనస్సు స్వరూపము. 'నే'నను తలంపే మనస్సు తొలితలంపు అదే అహంకారము. అహంకారమెచట పుట్టుచున్నదో అచ్చట నుండియే శ్వాసమును బయలుదేరుచున్నది. కనుక మనస్సణగి నపుడు ప్రాణమును, ప్రాణమణగునప్పడు మనస్సును అణగును. కాని సుషుప్తియందు మనస్సణగినను ప్రాణ మణగుట లేదు. దేహరక్షణ నిమిత్తము, దేహమనునది మరణించినదేమోయని ఇతరులకు సందేహము

కలుగకుండుటకు, ఈ విధముగ ఈశ్వరనియతిచే ఏర్పడియున్నది.

జాగృతియందును సమాధియందును మనస్సణగినపుడు ప్రాణమును అణగుచున్నది. ప్రాణము మనస్సు యొక్క స్థూలరూపమనబడును. మరణ కాలము వరకు శరీరమున మనస్సు ప్రాణమునుంచుచు నుండి దేహము మరణించు సమయమున ప్రాణమునాక్రమించి తీసికొని పోవుచున్నది. కాబట్టి ప్రాణాయామము మనస్సును లొంగజేసికొనుటకు తోడ్పడునేగాని దానిని నశింపజేయదు. ప్రాణాయామమువలెనే మూర్తిధ్యాన, మంత్రజప, ఆహార నియమములు మనస్సును లోబఱచుకొనుటకు సహాయకారులే. మూర్తి ధ్యానము చేతను మంత్ర జపము చేతను మనస్సు ఏకాగ్రస్థితిని పొందుచున్నది. మనస్సెప్పడును చలించుచునే యుండును. ఏనుగుతొండమెప్పడును చలించు చుండును. దానిపై ఒక గొలుసు పెట్టినచో ఆ యేనుగు దానినే పట్టుకొని ఇంకొక దానిని తీసికొనక పోవుచుండును. అట్లే సదా చలించుచుండు మనస్సు ఏదో ఒక నామమునకో, రూపమునకో అలవరచినచో

దానినే పట్టుకొని యుండును. మనస్సు లెక్కలేని తలంపులుగ విరియుట చే ఒక్కొక్క తలంపును అతి బలహీనమగుచున్నది. తలంపులు నాశము కానుకాను మనస్సేకాగ్ర స్థితిని పొంది దానిచే బలవంతము కాగా దాని ఆత్మవిచారము సులభముగ సిద్ధించును. నియమములన్నిటిలో ఉత్తమ మైన సాత్విక మితాహార నియమముచేత మనస్సున సత్వగుణము పెంపొంది ఆత్మ విచారమునకు సాయపడును.

**13. విషయ వాసనలు (తలంపులు) లెక్కకు మీఱి సముద్రము లోని అలల వలె కానవచ్చు చున్నవి. అవి ఎప్పుడు వీగిపోవును?**

స్వరూప ధ్యానము విజృంభింపగా విజృంభింపగా తలంపులన్నియు నశించును.

**14. అనాది నుండి వచ్చుచున్న సకల విషయ వాసనలు వీగి స్వరూపముగ నుండుట సాధ్యమా?**

'సాధ్యము కాదా, సాధ్యమా' అను సందేహపు తలంపునకు అవకాశ మీయక దృఢముగా స్వరూప

ధ్యానము పట్టువిడువక ఉండవలెను. ఒకడెంత పాపి అయ్యును, "నేను పాపినే? ఎట్లు కడతేరగలను?" అని పొక్కుచుపొక్కుచు నుండక 'నేను పాపిని' అను తలంపును పూర్తిగ నాశనము చేసి స్వరూపధ్యానము నందు దృఢమైన పట్టుదలతో ఉన్నట్లైన వాడు నిశ్చయముగ కడతేరును. మంచి మనస్సని, చెడ్డ మనస్సని రెండు మనస్సులు లేవు. మనస్సొక్కటే. వాసనలే శుభమని, అశుభమని రెండు విధములు. మనస్సు శుభవాసనల వశమున ఉన్నప్పడు మంచి మనస్సుగా ఉండును. అశుభవాసనల వశమగు నపుడు చెడ్డ మనస్సనబడును.

ప్రపంచ వ్యవహారములలోనికి ఇతరుల వ్యవహారములలోనికి మనస్సును పోనీయరాదు. ఇతరులెంత దుర్మార్గులయినను వారి విషయమున ద్వేషము పెట్టుకోరాదు. రాగద్వేషములు రెండును వర్జ్యములే. ఒకడు ఇతరులకిచ్చునది సర్వము తనకే ఇచ్చుకొనుచున్నాడు. ఈ సత్యము తెలిసిన ఈయకుండు వాడెవడు? తన వ్యక్తి తోచిన సకలమును తోచును. తన వ్యక్తిత్వ మడంగిన సర్వము నడంగును. ఎంతెంత

వినయముతో వర్తింతుమో అంతంత ఎక్కువ శుభము కలుగును. మనస్సు వశము చేసికొని యున్నచో ఎక్కడ నుండినను ఉండవచ్చును.

## 15. విచారమెంతవరకు ఆవశ్యకము?

మనస్సునందెంతవరకు విషయవాసనలు వసించియుండునో అంతవరకు 'నేను ఎవడ'నను విచారణ ఆవశ్యకము. తలంపుదయించగా ఉదయించగా వాని నప్పడప్పడే అవి పుట్టుతావుననే విచారణచే నశింపజేయ వలెను. ఒకడు స్వరూప ప్రాప్తిని పొందువరకు నిరంతర స్వరూపస్మరణము చేపట్టి యుండవలెను. అది యొక్కటియే చాలును. కోటలో శత్రువులున్నంత వరకు వారు వెలికివచ్చుచునే యుందురు. వారు తలచూపగా తలచూపగా అపుడపుడే వారిని చంపినచో కోట కైవశమగును.

## 16. స్వరూప స్వభావమేమి?

యథార్థముగ నుండునది ఆత్మస్వరూపమొకటే. జగజ్జీవేశ్వరులు ముత్తెపుచిప్పయందు వెండివలె అందు కల్పనామాత్రులే. ఈ మూడునొకమారే తోచి ఒకమారే అదృశ్యమగును. 'నే'నను తలంపు కించిత్తును లేని తానే

స్వరూపము. అదియే మౌన మనబడును. స్వరూపమే జగము; స్వరూపమే నేను; స్వరూపమే ఈశ్వరుడు. సకలము శివస్వరూపమే.

## 17. సర్వము ఈశ్వర కార్యమే కదా?

ఆదిత్యుని సన్నిధిమాత్రముచేత సూర్యకాంతపు రాయి అగ్నిని వెలిగ్రక్కుట, కమలములు వికసించుట, నీళ్ళింకుట, లోకజనులు తమ తమ పనులలో వర్తించి వాని జేయుటయు, తర్వాత మానుటయు, కాంతము నెదుట సూదికదలుటయు వలె, ఈశుని యిచ్ఛా, సంకల్ప, యత్నములవలనగాక సన్నిధి విశేష మాత్రమున జరుగుచున్న సృష్టి స్థితి సంహారములను మూడు వృత్తులకును లేదా పంచకృత్యములకును లోబడిన జీవులు తమ తమ కర్మానుసారము చేష్టించి, తర్వాత చేష్టలు మానుచున్నారు. అంతేగాని ఈశు డు సంకల్ప సహితుడు గాడు. ఏ కర్మ అతనిని అంటదు. అది, లోక కర్మలు సూర్యుని తాకకుండుటకును, అంతట వ్యాపించు ఆకాశమును కొదమ నాలుగు భూతముల గుణావగుణములు అంటకుండుటకును పోలియున్నది.

## 18. భక్తులలో ఉత్తమ భక్తుడెవరు?

స్వరూపమైన భగవంతునియందు ఎవడు తానే తనను అర్పణము చేసికొనునో అతడే భక్త శ్రేష్ఠుడు. ఆత్మచింతనము తప్ప ఇతర చింతలు పుట్టుటకు కొంచెమైనను తావీయక ఆత్మనిష్ఠాపరుడై యుండుటయే తనను ఈశ్వరున కర్పించుకొనుట. ఈశ్వరునిపై ఎంతభారము మోపినను దానినంతటిని అతడు వహించుచున్నాడు. సకల కార్యముల నొక పరమేశ్వర శక్తి నడపుచుండుటచేత మనమును దానికి లోబడియుండుట మాని, "ఇటు చేయవలెను. అటు చేయవలెను" అని సదా చింతించుచుండు టేల? పొగబండి సకల భారములన్నిటిని మోసికొని పోవునని తెలిసియున్నను, దానిలో నెక్కిపోయెడు మనము, మన చిన్న మూటనందు పడవైచి సుఖము గ నుండక, దానిని మన తలపై పెట్టుకొని ఏల కష్టపడ వలెను?

## 19. వైరాగ్యమనునది ఏమి?

ఏయే తలంపులుత్పత్తి యగునో దాని దానిని సకలమును ఒక్కటి విడువక ఉత్పత్తి స్థానములోనే

నశింపజేయుటయే వైరాగ్యము. ముత్తెము దెచ్చు వారొడియందు రాలను గట్టికొని మునిగి సముద్రపు టడుగున నుండెడు ముత్యముల నెటుసంగ్రహింతురో, అట్లే ఒక్కొక్కడును వైరాగ్యముంబూని తనలో లోతుగ మునిగిన ఆత్మ ముత్యముంబొందగలడు.

## 20. భగవంతునికి గాని, గురునికి గాని ఒక జీవుని ముక్తుని చేయ సాధ్యము కాదా?

ఈశుడు గురుడును ముక్తి చేరు మార్గమును జూపువారే గాని తామే జీవుని ముక్తిని జేర్చువారు గారు. యదార్థముగ ఈశుడును గురుడును వేఱు కారు. పులినోటబడిన దెట్లు తిరిగి రాదో అట్లే గురుకటాక్ష దృష్టిని పడినవారతనిచే రక్షింపబడుదురేగాని ఎన్నటికిని అతనిచే విడువబడరు. అయినను ఒక్కొక్కరును తమ ప్రయత్నముననే దైవము లేక గురుడు చూపిన దారి తొలగక అనుసరించి ముక్తిని జేరుకోవలెను. తన్ను తానే తన జ్ఞానచక్షువుచే చూచుకోవలెనుగాని ఇతరుల ద్వారా చూచుటెట్లు? రాముడు తన్ను రాముడని తెలిసి కొనుట కద్దము కావలెనా!

**21. ముక్తిని కోరువానికి తత్త్వముల విచారణ ఆవశ్యకమా?**

చెత్త నూడ్చి పారవేయవలసిన వానికి దానిని పరీక్షించుటచేనెట్లు ప్రయోజనము లేదో అట్లే తన్నెరుంగ గోరువాడు తన్ను మరుగుపరచు తత్వముల నన్నిటిని కూర్చి త్రోసిపారవేయక, ఇవి ఇన్నియని లెక్కించుట చేతగాని, వాని గుణములను పరీక్షించుట చేత గాని లాభము లేదు. ప్రపంచము ఒక స్వప్నము వలె తలచుకోవలెను.

**22. జాగ్రత్తకు స్వప్నమునకు బేధము లేదా?**

జాగ్రత దీర్ఘము; స్వప్నము క్షణికమగుట తప్ప వేరు భేదము లేదు. జాగ్రత్తునందు జరుగు వ్యవహార ములన్నియు ఎంత నిజముగా తోచుచున్నవో అంత నిజము గానే స్వప్పమునందు జరుగు వ్యవహారములు ను స్వప్నకాలమున తోచుచున్నవి. మనస్సు స్వప్నము నందు వేరొక శరీరమును దాల్చుచున్నది. జాగ్రత్స్వప్నము లు రెంటిలో ఏకకాలముననే తలంపులు నామ రూపములు కలుగుచున్నవి.

**23. ముముక్షువులకు శాస్త్రాధ్యయనము చేత**

## ప్రయోజనమున్నదా?

ఏ శాస్త్రమందును ముక్తి పొందుటకు మనస్సును లోబరచుకోవలెనని చెప్పియుండుటచే మనోనిగ్రహమే శాస్త్రముల చరమ సిద్ధాంతమని తెలిసి కొన్న తరువాత శాస్త్రములను తుదిలేక చదువుటచే లాభము లేదు. మనోనిగ్రహము కొరకు 'నేను ఎవడను?' అని తనలో విచారింపవలెనే కాని శాస్త్రములలో నెట్లు విచారింప నగును? తన్ను తన జ్ఞాననేత్రముచేత తానే గదా తెలిసి కోవలెను? 'తాను' పంచకోశముల లోపల నున్నది. శాస్త్రములో, పంచ కోశములకు వెలుపల నున్నవి. కనుక పంచకోశముల ద్రోసివైచి, విచారించి తెలియవలసిన తన్ను శాస్త్రములందు వెదకుట వ్యర్థము. ఒకప్పడు నేర్చినవాని నన్నిటిని మరవవలసి వచ్చును.

## 24. సుఖమనునది ఏది?

సుఖమనునది ఆత్మస్వరూపమే. సుఖమును ఆత్మస్వరూపమును వేరుగావు. ప్రపంచమున ఒక్క వస్తువులోను 'సుఖము' అనునది లేదు. మనము మన అవివేకముచే వానివలన సుఖము కలుగు

చున్నదని తలంచుచున్నాము. మనస్సు బయటికి పోవు నపుడు దుఃఖమనుభవించుచున్నది. వాస్తవమున మన కోరికలు తీరినపుడెల్ల మనస్సు యథాస్థానము నకు మరలి ఆత్మ సుఖమునే అనుభవించుచున్నది. అటులే నిద్రా, సమాధి, మూర్ఛా కాలమునందును, ఇచ్ఛగించిన వస్తువు లభించి నపుడును, విరుద్ధ విషయములకు హాని అయిన పుడును, మనస్సు అంతర్ముఖమై ఆత్మసుఖమునే అనుభ వించుచున్నది. ఈ విధముగ మనస్సు ఆత్మను వదలి బయటికి పోవుటయు లోపలికి మరలుటయు ఎడతెరపి లేక చరించుచున్నది.

వృక్షక్రింద నీడ సుఖముగా నున్నది. బయట సూర్యతాపము క్రూరముగా నున్నది. బయట తిరుగు వాడు నీడకు పోయి చల్లదనమనుభవించు చున్నాడు. కొంచెముసేపక్కడ నుండి తరువాత వెలుపలికి వచ్చి ఉష్ణక్రౌర్యమును తాళజాలక మరల వృక్షక్రిందికి వచ్చు చున్నాడు. ఈ విధముగ నీడలో నుండి ఎండలోనికి పోయి, ఎండలోనుండి నీడలోనికి వచ్చుచున్నాడు. ఇట్లు చేయువాడు అవివేకి. వివేకి ఏ నీడనూ విడిచి

పోడు.

అట్లే జ్ఞాని మనస్సు బ్రహ్మమును వదలదు కాని అజ్ఞాని మనస్సో ప్రపంచమందు కృషి చేసి దుఃఖ పడుచు బ్రహ్మములోనికి కొంచెముసేపు మాత్రము తిరిగివచ్చి సుఖమనుభవించుచున్నది. జగమను నది తలంపు మాత్రమే. జగము మరుగగునప్పుడు అనగా తలంపులు లేనప్పుడు మనస్సానందమనుభవించు చున్నది. జగము తోచునపుడు దుఃఖమనుభ వించుచున్నది.

## 25. జ్ఞాన దృష్టి యనగానేమి?

ఊరకయుండుటయే జ్ఞానదృష్టి అని పేరు. ఊరక యుండుట అనగా మనస్సు ఆత్మస్వరూప మందు లయింపజేయుటయే గాని ఇతరుల తలంపుల నెరుగుట, మూడు కాలములు తెలియుట, దూర దేశములలో జరుగువాని నెరుగుట, ఆదిగాగలవి జ్ఞాన దృష్టి కాజాలదు.

## 26. నిరాశకు, జ్ఞానమునకు గల సంబంధమేమి?

నిరాశయే జ్ఞానము. నిరాశ వేరు, జ్ఞానము వేరు గాదు. నిజమున రెండు ఒక్కటే. నిరాశయనగా

ఒక విషయము వైపునకును మనస్సు పోకుండుట. జ్ఞానమనగా ఒక్క విషయమును తోచకుండుట - ఇట్లు చెప్పిన, అన్యము నపేక్షింపకుండుట వైరాగ్యము లేక నిరాశ; తన్ను వదలకుండుట జ్ఞానము.

## 27. విచారణకు, ధ్యానమునకు గల భేదమేమి?

మనస్సును తనయందే ఉంచుకొనుట విచారమగును. తన్ను బ్రహ్మముగా సచ్చిదానందముగా భావించుట ధ్యానమగును.

## 28. ముక్తి అనగానేమి?

బంధమున ఉన్న 'తాను' ఎవడని విచారించి తన యదార్థ స్వరూపమును తెలిసికొనుటే ముక్తి.

శ్రీ రమణార్పణమస్తు

# శ్రీ రమణోపనిషత్తు

మానవుడు తాను బ్రహ్మమైయుండి, ఆ బ్రహ్మము తనహృదయములో ఆత్మరూపమున స్వయముగా ప్రకాశిస్తుండగా - ఆత్మను తెలుసుకొనుటకు హృదయమును శోధించుటమాని, శాస్త్రములను శోధిస్తున్న మానవమానసమును హృదయమువైపు గురిపెట్టించుటకు "నేనెవడను?" అను విచారణ పద్ధతిని బోధించి ఒక నవ్యమార్గాన్ని శ్రీ రమణాచార్యుడు ఆవిష్కరించారు. అదే ఈ "రమణోపనిషత్తు".

సృష్టి ప్రారంభమైనప్పటినుంచి మానవుడు చేస్తున్న ప్రయత్నము ఒక్కటే - దుఃఖస్పర్శలేని సుఖము కోసం తపనపడుతున్నాడు. దేవుడిని తెలిసికొనుట కూడా అందులో ఒక భాగముమాత్రమే. కాని నిజమైన సుఖము ఎక్కడఉందో తెలిసేవరకు మానవుడు దుఃఖములో నుంచి బయటపడలేడు. మరి ఆ నిజమైన సుఖం ఎక్కడవుంది?

ఒక్క ఆత్మలోతప్ప ఈ సృష్టిలో సుఖము ఎక్కడా లేదు. ఉన్నది ఆత్మ ఒక్కటే. అది అనంతము, అఖండము,

అమరము, అజరము, అద్వితీయము, అనిర్వచనీయము, అవ్యయము, అభవము, అభౌతికము, అలౌకికము, అది సత్‌చిత్‌ఆనంద స్వరూపము. సినిమాబొమ్మలకు తెర ఎలాఆధారమో - ఈ సృష్టికి ఆత్మే అధారము. దానిని నీరు తడుపలేదు - నిప్ప కాల్చలేదు - గాలి కదుపలేదు. దానికి పుట్టుకాలేదు - మరణమూ లేదు. దానికి ఆదీ లేదు - అంతమూ లేదు. అది కాలాతీతము - ఊహాతీతము - గుణాతీతము. అది మీకు దూరాన ఎక్కడోలేదు - మీ స్వరూపముగానే ఉంది - మీ హృదయములోనే ప్రత్యక్షముగా ప్రకాశిస్తున్నది.

మీ స్వరూపాన్ని మీరు మరచిపోయి - పుట్టి, పెరిగి, గిట్టే ఈదేహమే మీరని భ్రమపడుతున్నారు - అందుకే దుఃఖపడుతున్నారు. మీస్వరూపము మీకు తెలిసేవరకు మీరు దుఃఖములోనుంచి బయటపడలేరు.

మీ స్వరూపము మీఅనుభవములో లేదు - కాని మీరు "నేను, నేను" అని అంటున్నారే - ఈ "నేను" మీ అనుభవములో వుందికదా? దీనిని గురించి మీరెప్పుడైనా ఆలోచించారా?

మీ గాఢనిద్రలో మీ "నేను" గొడవ మీకు

ఉందా? మీ "నేను" లేనప్పడు మీదేహంగొడవగాని, లోకంగొడవగాని, దేవునిగొడవగాని మీకువుందా? - లేదు. కాని నిద్రలోనుంచి మెలకువరాగానే మరల మీకు "నేను" అను తలంపు వస్తున్నది. ఆతలంపు వెనకాలే మీసంసారమంతా మీకు గుర్తుకువస్తున్నది - మీకు దుఃఖాన్ని తీసుకువస్తున్నది.

నిజమనేది ఎప్పడూ ఉంటుంది - అది ఒకటి గానే ఉంటుంది - అందులోనుంచి సుఖము వస్తుంది.

మరి మీరుఅంటున్న "నేనే" కనుక నిజమైతే - అది మీగాఢనిద్రలో ఎందుకు ఉండుటలేదు? మీరు అంటున్న "నేనే" గనుక నిజమైతే దానికి రాగం ఎందుకు వస్తున్నది - ద్వేషం ఎందుకు వస్తున్నది - కామం ఎందుకు వస్తున్నది - లోభం ఎందుకు వస్తున్నది - దుఃఖం ఎందుకు వస్తున్నది? అది ఎప్పడూ ఒకటిగా ఎందుకు ఉండలేకపోతున్నది?

మీరుఅంటున్న "నేను" నిజముకాదు - అందుకే అది క్షణక్షణం మారుతున్నది - మీకు దుఃఖాన్ని తెస్తున్నది.

గాఢనిద్రలో మీదేహగతమైన "నేను" లేదు - అయితే అప్పడు మరి మీరులేరా? మీరు లేకపోతే

మెలుకువరాగానే "నాకు సుఖముగా నిద్రపట్టినది" అని ఎవరు చెపుతున్నారు? ఆ సుఖాన్ని మీరు అనుభవించి చెపుతున్నారా - లేక అనుభవించకుండానే చెపుతున్నారా? మరి గాఢనిద్రలో సుఖముగావున్న ఆ "నేను" ఎవరు? - అదే ఆత్మగతమైన అసలు "నేను". ఆ "నేను" ఎప్పుడూవుంది - మీ మెలుకువలోనూవుంది. కాని అది మీఅనుభవములోనికి రాకుండా మీ దేహగతమైన "నేను" మీకు అడ్డుపడుతున్నది.

గాఢనిద్రలో మీరు సుఖముగా ఉన్నారు - కాని ఉన్నసంగతి మీకు తెలియుటలేదు. జాగ్రదవస్థలో మీరు ఉన్నారని మీకు తెలుస్తున్నది - కాని సుఖముగా మాత్రములేరు. ఆగాఢనిద్రలోనున్నసుఖాన్ని మీరు ఎరుకలోనుండగా అనుభవములోనికి తెచ్చుకోగలిగితే - అదే మోక్షం! మోక్షమనేది సంపాదిస్తే వచ్చేదికాదు - అది ఎప్పుడూవుంది. మీరు మోక్షాన్ని కోరుకునేటప్పుడు కూడా మీరు మోక్షములోనే వున్నారు. మీ స్వరూపమే మోక్షం. మీస్వరూపసుఖాన్ని మీరు అనుభవించకుండా మీ దేహగతమైన "నేనే" మీకు

అడ్డుపడుతున్నది. మీ కష్టాలకు, నష్టాలకు కారణమైన మరి ఈ "నేను" ఎవరు?

దేహము జడము - దానికి "నేను" అని చెప్పగల శక్తిలేదు. ఆత్మచైతన్యము - దానికి పుట్టుకలేదు. మరి ఈ నేను ఎవరు?

చైతన్యమైన ఆత్మను - జడమైన దేహమును కలిపి ముడిపెడుతూ రెండింటికిమధ్యన దేహపరిమిత మైన "నేను" ఒకటి పుట్టుచున్నది - అదే చిజ్జడగ్రంథి - అదే అహంకారము - అదే అజ్ఞానము - అదే జీవుడు - అదే కారణశరీరము.

ఈ "నేను" నిజముకాదు - అది కేవలము ఒక తలంపుమాత్రమే! మనకు వచ్చుతలంపులలో ఈ "నేను" అనునది ప్రథమతలంపు, ప్రధానతలంపు, పునాదితలంపు, ఈ "నేను" అను తలంపునకే మిగిలిన తలంపులన్నీ వచ్చుచున్నవి - ఆ తలంపులమూటే మనస్సు!

ఈ "నేను" దేహపరమైనదే! ఐనప్పటికీ అది దేహము మరణించినప్పుడు మరణించదు. దాని మూలమును అది చూసేవరకూ అది నశించదు. మరి దానిమూలము ఎక్కడవుంది?

ఈ "నేను" అను తలంపు మన లోపలనుంచే వచ్చుచున్నది. అందుకే ప్రతీమనిషి "నేను, నేను" అని ఛాతీమీద కుడివైపు క్రిందిభాగములోనే చేయి వేసుకుంటాడు. అంటే ఆ "నేను"కు మూలం అక్కడనే వుంది - అదే ఆధ్యాత్మికహృదయం!

ఆహృదయములో బ్రహ్మము నిరంతరము "నేను, నేను" అని స్వయముగా ఆత్మరూపమున ప్రకాశిస్తున్నది. అదే నిత్యమైన సత్యమైన ఆత్మగతమైన అసలు "నేను"! నీటిలోనుంచి బుడగవచ్చినట్లు - ఆత్మ గతమైన ఈ అసలు "నేను"లోనుంచే దేహపరిమిత మైన "మిథ్యానేను" పుట్టుచున్నది. సూర్యకాంతినుంచి వెలువడిన ఒకానొక కాంతి కిరణమువలె - ఆత్మ శక్తి నుంచి వెలువడిన ఒకానొక అతిశయశక్తే ఈ "మిథ్యా నేను". కాని అది దానిమూలమును మరిచిపోయి తాను స్వయంభవుణ్ణి అనుకొని స్వతంత్రముగా వ్యవహరిస్తున్నది. ఈ "నేను" అను ఒంటిస్థంభము మీదనే ఈసృష్టి అంతా ఆధారపడియున్నది. ఈ "నేను" పుట్టినప్పుడే జీవుడు పుట్టాడు - మరల ఈ "నేను" మరణించినప్పుడే జీవుడు మరణిస్తాడు. ఈ "నేను"

అను తలంపు పుట్టకముందు ఉన్నస్థితియే మనుము ఆదిగా ఉన్నస్థితి. ఈ "నేను" అను తలంపు కొంచెము కూడా లేనిచోటనే స్వరూపమువుంది.

"నేను" ఆత్మ - "నేను" అను తలంపు అహంకార ము. ఆత్మ అనంతమైనది - అహంకారము దేహపరిమిత మైనది. ఆత్మ సముద్రమైతే - అహంకారము బుడగ వంటిది. బుడగలేకుండా సముద్రము ఉండగలదు. కాని సముద్రములేకుండా బుడగ ఉండలేదు. అదేవిధముగా అహంకారములేకుండా ఆత్మ ఉండగలదు - కాని ఆత్మ లేకుండా అహంకారము ఉండలేదు. అహంకారానికి దేహము కావాలి, లోకము కావాలి, దేవుడు కావాలి. కాని దేహములేకుండా, లోకములేకుండా, దేవుడు లేకుండా ఆత్మ ఉండగలదు - అది స్వయంప్రకాశము.

"నేను దేహము లోపలవున్నాను - నాకు బయట లోకముంది - దేవుడు ఎక్కడో దూరాన వున్నాడు అని మనిషి భ్రాంతి పడుతున్నంతకాలము వాడిని ఆశ విడిచిపెట్టదు. ఆశ ఉన్నమనిషి ఫలితాన్ని ఆశించకుండా పనిచేయలేడు. ఫలితాన్నిఆశించి పని చేసినంతకాలము - ఆ పనిలోనుంచి వాసన (సంస్కారము) పుడుతుంది.

ఈ వాసనలు హృదయ ములో బీజరూపమున దాగివుంటాయి. మరుజన్మలో మరల ఆ వాసనలలోనుంచి కోరిక (తలంపు) పుడుతుంది. ఆ కోరిక మరల పనిచేయిస్తుంది. ఆ పని వలన ఫలితము వస్తుంది. ఆ ఫలితమును అనుభవిస్తాడు. ఆ అనుభవములోనుంచి మరల వాసన పుడుతుంది. ఇది కర్మసముద్రము. కర్తృత్వబుద్ధి ఉన్నంతకాలమూ మానవుడు ఈ కర్మసముద్రాన్ని దాటలేడు - జననమరణచక్రములోనుంచి బయట పడలేడు.

హృదయములోనున్న వాసనలు నిశ్శేషముగా బయటకుపోకుండా ఏజీవుడూ జ్ఞానికాలేడు. జ్ఞాని కానివాడు దేవునిలో లయముకాలేడు. హృదయములో ఒక్కవాసన మిగిలినప్పటికీ అది జన్మకు హేతువు అవుతుంది - మోక్షసుఖము మీ అనుభవములోనికి రాకుండా అది అడ్డుపడుతుంది. కోటలో శత్రువులు ఉన్నంతకాలము కోట స్వాధీనమౌతుందా?

హృదయములోనున్న వాసనలు తలంపు రూపములో శిరస్సులోనికి వచ్చేవరకు మీహృదయము లో ఏకోరికలు (వాసనలు) దాగివున్నాయో మీకే

తెలియదు. నెరవేర్చినకోరిక మరింతబలపడుతుంది - నిరోధించిన కోరిక చిక్కిపోయి రాలిపోతుంది. కనుక కోరిక ఉదయించగానే దానిని ఆచరణలో పెట్టకుండా - "ఈకోరిక ఎవరికి కలుగుచున్నది?" అని ప్రశ్నించుకోవాలి! అప్పడు "నాకు" అని తెలుస్తుంది. మరి కోరికవచ్చే "నేను ఎవడను?" అని విచారణ చేస్తే - అప్పటివరకు బాహ్యసుఖాలకోసం లోకాలవెంట తిరిగే మనస్సు ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరియై సమాధానము తెలియక తల్లక్రిందులై తనమూలమును శోధించుట మొదలుపెడుతుంది.

**"నేనెవడను?"**

పంచభూతములతో తయారైన ఈదేహము నేనా? ఈదేహమే గనుక నేనైతే - ప్రాణము పోయిన తరువాతకూడా ఈదేహము (శవము) "నేను ఉన్నాను" అని అనాలిగా? ఏ శవమైనా అలా అంటున్నదా? దేహము జడము - దానికి మాటలాడే శక్తిలేదు. కనుక జడమైనదేహము నేనెట్లుకాగలను? దేహము నేను గాకున్న మరి నేనెవడను?

"కర్మచేసే కర్మేంద్రియములు నేనా? లేక

విషయములను గ్రహించు జ్ఞానేంద్రియములు నేనా? దేహమే నేనుగానప్పడు - మరి దేహములో భాగమైన ఈఇంద్రియములు నేనెట్లుకాగలను? ఇంద్రియములు నేనుగాకున్న మరి నేనెవడను?

"ప్రాణము" నేనా? ప్రాణమేగనుక నేనైతే - చివరి శ్వాస గాలిలో కలిసిపోయిన తరువాతకూడా "నేను ఉన్నా"నని నాకు తెలియాలికదా? నాఉనికి నాకు తెలియనప్పడు ఆప్రాణము నేనెట్లుకాగలను? ప్రాణము నేనుగాకున్న మరి నేనెవడను?

"మనస్సు"ను నేనా? మనస్సేగనుక నేనైతే - అది నిత్యమూ (జాగ్రద, సుషుప్తి, స్వప్నావస్థలలో) ఉండాలి కదా? కాని గాఢనిద్రలో (సుషుప్తిలో) మనస్సు ఉండుట లేదు. మరి గాఢనిద్రలో దాని అస్తిత్వాన్ని కోల్పోతున్న మనస్సును నేనెట్లుకాగలను? మనస్సును నేనుగాకున్న మరి నేనెవడను?

"అయితే గాఢనిద్రలో మనస్సు లేనప్పడు మరి నేనులేనా? గాఢనిద్రలోగనుక నేనులేకపోతే నిద్ర నుంచి మేల్కొన్న తరువాత నాకు సుఖముగా నిద్ర పట్టినదని నేనెట్లు చెప్పగలుగుతున్నాను? గాఢనిద్రలో

కూడా నేను ఉన్నానుగాబట్టే, సుఖాన్ని అనుభవిస్తున్నాను గాబట్టే - "నాకు సుఖముగా నిద్రపట్టినది" అని చెప్ప గలుగుతున్నాను. మరి గాఢనిదలో సుఖముగా ఉన్న ఆ "నేను ఎవడను?".

ఆ నేనే నిజమైన "**నేను**"! అదే చైతన్యము! అదే ఆత్మ! అదే బ్రహ్మము!

ఆ నేను మన మెలుకువలోను, నిద్రలోను, స్వప్నములోను సమానముగానే ఉంది. కాని అది మన అనుభవములోనికి రాకుండా మన పరిమితబుద్ధే (దేహము నేను అన్న భావనే) మనకు అడ్డుపడుతున్నది.

మనము ఎప్పుడైతే "నేనెవడను?" అని విచారణ మొదలుపెట్టామో - అప్పుడు మన దేహాగత మైననేను మనస్సునుంచి విడివడి అంతర్ముఖమై తన మూలమును శోధిస్తూ హృదయమువైపు ప్రయాణము చేస్తుంది. అప్పడు మనస్సులోనికోరికలు విజృంభించు టకు ఆధారములేక, అవకాశముచిక్కక, వాటివేగము తగ్గి, క్రమముగాచిక్కి, సన్నగిల్లి రాలిపోతాయి. కోరికలు తగ్గినకొలదీ మన దేహాగతమైన "నేను" హృదయములో నిలకడగా ఉండగలుగుతుంది -

దానికి ఆత్మరుచి అందుతుంది.

రూపాయి ఉన్నవాడిచేతికి వందరూపాయలిచ్చి, ఆరూపాయిని క్రిందపారవేయమంటే ఎలా పారవేస్తాడో - అదే విధముగా భౌతికమైన క్షణిక సుఖాలను మరగిగివున్న మనమనస్సు అభౌతికమైన ఆత్మ సుఖాన్ని ఎప్పుడైతే రుచిచూసినదో - వెంటనే మన మనస్సు ఆగిపోతుంది - ఆత్మలో అణిగిపోతుంది - తన ఉనికినే కోల్పోతుంది. అంత - సముద్రములో లేచిన అలలు సముద్రములోనే అణిగిపోయినట్లు - మన దేహగతమైననేను దాని మూలములో అణిగిపోయి - అహంవృత్తి నశించి - వెంటనే అహంస్ఫురణ కలుగు తుంది. ఆత్మగతమైన **"నేను"** తానుగా వ్యక్తమౌతుంది. ఏ సుఖాలకోసమైతే భ్రమపడి మనము బాహ్యంగా పరుగెడుతున్నామో - ఆ సుఖమే మనమౌతాము.

"నేను ఎవడను?" అను విచారణ మహా వ్రతము, విజృంభిస్తున్న మనస్సు అనే మదపుటేనుగునకు - "నేను ఎవడను?" అను ప్రశ్న అంకుశము వంటిది. "నేను ఎవడను?" అను ప్రశ్నను అభ్యాసము

చేయగా చేయగా - అది అన్నితలంపులను నాశనము చేసి - శవమునుదహించు కొటివికట్టెవలె చివరకు ఈ "నేను" అను తలంపుకూడా కాలిపోయి రాలిపోతుంది. మీ "నేను" పోతే మిగిలింది మీరే!

**మీ స్వరూపమే సుఖం!**

మిగిలిన జీవులకు లేనిబుద్ధిని భగవంతుడు మనకు ప్రసాదించాడు - ఎందుకు? ఆలోచించమని! కనుక ఆలోచించండి! మీ సొంతబుద్ధిని విడిచిపెట్ట కండి! ఆలోచనే అమృతం! ఆలోచిస్తే మీరు అమృత మూర్తులౌతారు - దుఃఖ సాగరాన్ని దాటిపోతారు - శాంతి శిఖరాలను చేరుకుంటారు.

**తత్వమసి!**

*Designed at*

**Ananya Graphics**

**PALAKOL**

☎ 08814 - 309258, 9397151342

*Printed at*

**Sri Bhavani Offset Printers**

(Dude Srinu), SVR Complex

PALAKOL, ☎ 08814 - 228858

# అరుణాచలం

మనిషికి గుండె ఎటువంటిదో - ఈ భూమండలానికి అరుణాచలం అటువంటిది.

అరుణాచల స్మరణ పంచాక్షరీతో సమానము. స్మరణ మాత్రముననే అహంకారమును హరించు క్షేత్రమది. అరుణగిరి ప్రదక్షిణ పుణ్యప్రదము. అది కోరికలు నెరవేర్చు కొండ.

అరుణాచల క్షేత్రములో ఈశ్వరుడు మూడు రూపములలో ఉన్నాడు. 1. గిరి రూపము, 2. లింగ రూపము, 3. రక్త మాంసము లతో సశరీరుడై కొండపైన ఉత్తర దిక్కున ఒక మర్రిచెట్టు క్రింద 'అరుణగిరియోగి' రూపములో ఉన్నాడు.

పంచభూతముల కలయికే ప్రకృతి. ఈ పంచభూతము లకు పంచలింగములను ప్రతిష్టించినారు మన పెద్దలు. 1. అరుణా చలము - అగ్నిచలము - ఇదే ఆదిలింగము. 2. జంబుకేశ్వరము - జల లింగము. 3. కాళహస్తి - వాయులింగము. 4. కంచి - పృథ్వి లింగము, 5. చిదంబరము - ఆకాశ లింగము.

కాశీలో మరణిస్తే మోక్షం - తిరువయ్యూరులో జన్మిస్తే మోక్షం! కాని ఆ చావు పుట్టుకలు రెండూ మనిషి చేతిలో లేవు. చిదంబరాన్ని దర్శిస్తే మోక్షం - దర్శించటానికి ధనం కావాలి! అరుణాచలాన్ని స్మరిస్తేనే చాలు - మోక్షం! స్మరించటానికి ఖర్చేముంది? కనీసం స్మరించలేరా?

"అరుణాచలాన్ని స్మరిస్తేనే మోక్షం వస్తుందా? మోక్ష మంటే మరీ అంత తేలిగ్గా ఉందా?" అని ఒక పెద్ద మనిషి భగవాన్ శ్రీ రమణమహర్షిని ప్రశ్నించాడు.

"ఔను! అరుణాచలాన్ని స్మరిస్తే చాలు - మోక్షం వచ్చి తీరుతుంది. అది ఈశ్వరుని ఆజ్ఞ! ప్రశ్నించటానికి నీవెవరవు? అసలు నీవు ముందు స్మరించి చూడు! మోక్షం వస్తుందో లేదో నీకే తెలుస్తుంది" అన్నారు భగవాన్.

**మీరూ అరుణాచలాన్ని ప్రేమించండి - ఆ అరుణాచలమే మీరౌతారు.**

Ananya Graphics, Palakol 9397151342